ఓపెన్ స్కూళ్లలో తత్కాల్ అడ్మిషన్లకు అవకాశం

నెల్లూరు(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో 2025-26 విద్యాసంవత్సరానికి టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి తత్కాల్ అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పించినట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యాసకులు అడ్మిషన్స్ పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించడంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను సంబంధిత ఏఐ సెంటర్‌కు సంబంధించిన ఏఐ కోఆర్డినేటర్‌లకు సమర్పించి అడ్మిషన్‌ను ధ్రువీకరించుకోవాలని సూచించారు. తత్కాల్ అడ్మిషన్‌కు రెగ్యులర్ అడ్మిషన్ ఫీజుతోపాటు అదనంగా రూ.600 చెల్లించి ఈనెల 6వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విభజన జరగనున్న పంచాయతీలు

మండలం	ప్రస్తుతం	ప్రతిపాదన
మనుబోలు	వీరంపల్లి	రాజోలుపాడు
మనుబోలు	వడ్లపూడి	గొట్లపాలెం
వెంకటాచలం	అనికేపల్లి	గొలగమూడి
వెంకటాచలం	తిక్కవరప్పాడు	జోసఫ్‌పేట
వెంకటాచలం	కసుమూరు	శ్రీరామపురం
పొదలకూరు	తాటిపర్తి	నల్లపాలెం
సంగం		సిద్ధిపురం, అనసూయనగర్
చేజర్ల	నూతక్కవారికండ్రిగ	గాలిపాలెం
మర్రిపాడు	చిన్నమాచనూరు	కదిరినేనిపల్లి, నాగరాజపాడు, నేర్దనంపాడు
కొడవలూరు	యల్లాయపాలెం	రామాపురం
కొడవలూరు	కమ్మపాలెం	చంద్రశేఖరపురం
జలదంకి	బ్రాహ్మణక్రాక	బీకే అగ్రహారం
కొండాపురం	కొండాపురం	హనుమకొండపాలెం
కొండాపురం	సాయిపేట	మహేశ్వరపురం
కొండాపురం	గోనుగంపేట	ఆదిమూర్తిపాలెం
కలిగిరి	కలిగిరి	జిర్రావారిపాలెం
కలిగిరి	కృష్ణారెడ్డిపాలెం	నరసారెడ్డిపాలెం
వింజమూరు	బుక్కపురం	చంద్రపడియ
గుడ్లూరు	మోచర్ల	తెట్టు
గుడ్లూరు	చిన్నలత్రిపి	జానకంపేట
గుడ్లూరు	పరకొండపాడు	వడ్లమూడివారిపాలెం
వీవీపాలెం	చుండి	కాకర్లవారిపాలెం
లింగసముద్రం	లింగపాలెం	రేళ్లపాడు
లింగసముద్రం	పెంట్రాల	చెమలపెంట, రాళ్లపాడు
ఉలవపాడు	ఉలవపాడు	కే రాకుపాలెం
ఉలవపాడు	బీమవరం	కే రాజుపాలెం
ఉలవపాడు	కరేడు	అలగాయపాలెం
ఉలవపాడు	మన్నేకోట	మన్నేకోట సౌత్
ఉలవపాడు	పెద్దపట్టపులం	రెడ్డిపాలెం
కందుకూరు	పాలూరు దొండపాడు	దొండపాడు
కలువాయి	కనుపూరుపల్లి	కనుపూరుపల్లి
కలువాయి	చవటపల్లి	వెదనపర్తి
బోగోలు	నాగులవరం	సీజీవీ కండ్రిగ
దగదర్తి	చెన్నూరు	కట్టుబడిపాలెం, తిమ్మారెడ్డిపాలెం
దుత్తలూరు	బైరవరం	జంగాలపల్లి

జిల్లాలో టెక్స్‌టైల్ పార్కుకు
కేంద్రం ఆమోదం
వివరాలు 6లో..

కొత్త పంచాయతీలకు వేళాయె!

ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం

జిల్లాలో 39 పంచాయతీల విభజనకు దరఖాస్తు

నెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలైంది. కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు



ఇవ్వడంతో భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. స్థానిక రాజకీయ, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఆయా ప్రాంత వాసులు ఆసక్తి చూపుతున్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఈ దఫా ప్రభుత్వం రెండు ప్రధాన నిబంధనలు తీసుకొచ్చింది. ప్రస్తుతమున్న పంచాయతీ పరిధిలోని ఏదైనా మజారా ఆ పంచాయతీ కేంద్రానికి మూడు కిలోమీటర్లకుపైగా దూరంలో ఉంటే అటువంటి వాటిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించారు. అలానే ఏదైనా హ్యాబిటేషన్ లేదా హ్యాబిటేషన్లు కలిసి పంచాయతీగా ఏర్పాటు కావాలనుకుంటే అక్కడి జనాభా మూడు వేలకుపైగా ఉండాలని నిబంధన విధించింది. అయితే ఈ రెండో నిబంధన ప్రకారం జిల్లాలో మూడు వేల జనాభా కలిగిన హ్యాబిటేషన్లు లేవు. కానీ మొదటి నిబంధన ప్రకారం పంచాయతీ కేంద్రానికి మూడు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండే హ్యాబిటేషన్లు చాలానే ఉన్నాయి. ఇటువంటి వాటిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలనుకుంటే ఆయా గ్రామస్థులు గ్రామసభ పెట్టుకొని దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే జిల్లాలోని 20 మండలాల నుంచి 35 గ్రామ పంచాయతీలను విభజించేందుకు దరఖాస్తులు అందాయి. వీటి విభజన ద్వారా 39 పంచాయతీలు ఏర్పాటు చేసేందుకు గానూ ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఈ దరఖాస్తులను పంచాయతీ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇప్పటి కే 12 కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి.

● పెరగనున్న ప్రజాప్రతినిధుల సంఖ్య

గత ఎన్నికలలోనే పంచాయతీల విభజన జరిగినా ఇప్పుడు మాదిరిగా ఇంత భారీ స్థాయిలో కొత్తవి ఏర్పాటుపై కసరత్తు జరగలేదు. దరఖాస్తులన్నింటినీ

- మిగతా 5వ పేజీలో...

తప్పిన ముప్పు!


- మధ్యాహ్నం నుంచి తగ్గి.. రాత్రి మళ్లీ మొదలైన వాన
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- ప్రధాన జలాశయాల్లో పుష్కలంగా నీరు
- లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో నీట మునిగిన పైరు
- నష్టం అంచనాల తయారీలో వ్యవసాయ శాఖ

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'దిత్వా' తుఫాన్ ముప్పు జిల్లాకు తప్పింది. ఈ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మూడు రోజులపాటు వర్షాలు కురిశాయి. అయితే, మంగళవారం మధ్యాహ్నం నుంచి వరుణుడు కరుణించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, రాత్రి నుంచి మళ్లీ వాన మొదలైంది. కురిసిన వర్షాలకు జిల్లాలోని వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండగా, ప్రధాన జలాశయాలు అయిన సోమశిల, కండలేరు, రాళ్లపాడు రిజర్వాయర్లతోపాటు చెరువుల్లో నీరు పుష్కలంగా వచ్చి చేరుతోంది. కాగా, తుఫాన్ ప్రభావంతో జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవటంతో ప్రజలకు పెద్దగా ఇబ్బందులు కలగలేదు. లోతట్టులో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. వరినారు మళ్లు నీట మునగడంతో రైతులు నష్టపోయారు. వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా నష్ట అంచనాలను తయారుచేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే, వాయుగుండం ప్రభావంతో బుధవారం కూడా పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచనలు చేసింది. కాగా, జిల్లాలో మంగళవారం సగటు వర్షపాతం 1.8 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కోవూరులో 14.8 మి.మీ, అత్యల్పంగా జలదంకిలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఐదు మండలాల్లోని 26 గ్రామాల్లో 333 మంది రైతులకు చెందిన 81 హెక్టార్లలో వరినారు, 208 హెక్టార్లలో వరిపైరు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది.



కలువాయి : జడ్పీ హైస్కూల్ ఎదుట వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రోడ్డు





పెద్ద పులులు ఎన్ని.. చిరుతలెన్ని!?

నేటి నుంచి జిల్లావ్యాప్తంగా జంతు గణన ● 10వతేదీ వరకు సర్వే ● 74 బీట్లు.. 222 మంది సిబ్బందితో లెక్కింపు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) / మర్రిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఒకేసారి చేపట్టే ఈ ఆల్ ఇండియా టైగర్ సెన్సెస్ ఎస్టిమేషన్ 2026 (ఏఐటీఈ) సర్వే డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్నది. అయితే నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో దిత్వా తుఫాన్ నేపథ్యంలో ఈ సర్వే ప్రారంభం కాలేదు. ప్రస్తుతం తుఫాను బలహీన పడటంతో బుధవారం నుంచి సర్వే ప్రారంభించనున్నట్లు అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో బుధవారం నుంచి 10వ తేదీ వరకు సర్వే జరగనున్నది. ప్రతి నాలుగేళ్లకోసారి దేశవ్యాప్తంగా పులుల గణన చేపడతారు. ఇప్పటిదాకా ఐదు సార్లు ఈ గణన జరగ్గా, ప్రస్తుతం 6వ సారి పులులను లెక్కించనున్నారు. అటవీ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ (యలాజికల్ సైన్స్ యాప్) ద్వారా ఈ సర్వే చేపడతారు. కాగా, జిల్లావ్యాప్తంగా సుమారు 2.81 లక్షల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. నెల్లూరు, కావలి, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి ఐదు రేంజ్‌ల పరిధిలో 74 బీట్‌లలో ఈ సర్వే చేపట్టనున్నారు. బీట్‌కు ముగ్గురు చొప్పున 222 మంది అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఈ సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొననున్నారు.



సర్వే ఎలా చేయాలో అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న నిపుణులు

ఇప్పటికే రెండు పెద్ద పులులు

జిల్లాలో ఎక్కువగా చిరుతలు మాత్రమే ఉన్నాయి. తొలిసారి గతేడాది మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి ప్రాంతంలో పెద్దపులి ఓ కారుపై దాడి చేయడంతో పెద్దపులుల సంచారం జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అనుమానిత అటవీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పెద్దపులల జాడ ఉన్నట్లు స్పష్టంగా నిర్ధారణ అయింది. నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దులో పెద్దపులులు సంచరిస్తున్నట్లు గుర్తించారు. నల్లమల ఫారెస్ట్ నుంచి ఈ పులులు వచ్చినట్లు గుర్తించారు. ఇక గతంలో జరిగిన సర్వేలో దాదాపు 70కిపైగా చిరుతలు జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. వీటితోపాటు ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, చుక్కల జింకలు, అడవిపందులు, కృష్ణజింకలు, కొమ్ముల జింకలు, కోతులు, కొండముచ్చులు, అడవి పిల్లులు, ఉడుములు, పాములు, నెమళ్లు, దుప్పిలు, చింపాంజీలు, పొంగలిన్‌లు, అడవి దున్నలు, కుందేళ్లు, కొండచిలువలు, అనేక రకాల పక్షులు వేల సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ద్వారా మే నెల తరువాత జంతుగణన నూతన లెక్కలు తేలనున్నాయి. అటవీ ప్రాంతాల్లో జంతు సంపద వృద్ధి చెందిందా.. లేదా అనే లెక్కలు ఈ సర్వే ద్వారా తేలనున్నాయి.

● సర్వే ఇలా...

8 రోజులపాటు జరిగే సర్వేలో మొదటి మూడు రోజులు అన్నీ బీట్‌లలో తిరుగుతూ కంటితో చూసిన దృశ్యాలను, వివరాలను నమోదు చేస్తారు. ఆ తరువాత 2 రోజులు ఈ వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. చివరి మూడు రోజులు అదే బీట్‌లలో తిరు గుతూ జంతువుల పెంటికలు, పాద ముద్రల గుర్తులను సేకరించి భద్రపరు స్తారు. జంతువులు నేరుగా కనిపిస్తే ఫొటోలు తీస్తారు. లేదా చెట్ల రాపిడి, పెంటికలు తదితరాలకు గుర్తిస్తారు. అడవుల్లో తిరిగే వారి నుంచి కూడా సమాచారం సేకరిస్తారు. పులుల గణన ప్రధానమైనా ఇతర జంతువులతో అన్నీ అంశాలను సర్వేలో గుర్తిస్తారని ఆత్మకూరు రేంజ్ అటవీ శాఖ అధికారి శేఖర్ తెలిపారు. అయితే, ఇంతటితో ఈ సర్వే అయిపోదు. జిల్లావ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో దాదాపు 250 అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. మే నెల చివరి వరకు ఈ కెమెరాల్లో చిక్కిన దృశ్యాలను బట్టి జిల్లాలో పెద్దపులులు ఎన్ని ఉన్నాయో లెక్క తేలుస్తారు. పెద్దపులుల గురించే కాకుండా అన్నీ రకాల జంతువులు, పక్షులు, వన్యప్రాణులు లెక్క రానున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.



మర్రిపాడు : అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చుతున్న అటవీ శాఖ సిబ్బంది

ఈ సర్వే ఎంతో ఉపయోగం



ఆల్ ఇండియా టైగర్ సర్వే డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు చేయల్సి ఉంది. అయితే దిత్వా తుఫాను కారణంగా బుధవారం నుంచి జిల్లాలో సర్వే చేస్తాము. ఈ సర్వే ద్వారా పులలతోపాటు అన్నీ రకాల జంతువులు, పక్షుల లెక్కలూ తేలనున్నాయి. అంతేగాక అడవుల్లో ఉన్న ఎలాంటి పరిస్థితులైనా పూర్తిగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

- మహబూబ్ బాషా, అటవీ శాఖ డీఎఫ్‌వో

నెల్లూరు మేయర్‌పై 18న అవిశ్వాసం

- తేదీ ఖరారు చేసిన కలెక్టర్ శుక్లా
- సమాయత్తమవుతున్న అధికార, ప్రత్యర్థి పార్టీలు

నెల్లూరు (సిటీ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతిపై అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు కలెక్టర్ హిమాన్షు శుక్లా తేదీ ఖరారు చేశారు. 18న ఉదయం 11.30 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మేయర్ పదవి నుంచి స్రవంతిని దించాలని కోరుతూ ఇటీవల డిప్యూటీ మేయర్లతోపాటు కార్పొరేటర్లు కలెక్టరేట్‌లో నోటీసు అందచేశారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ శుక్లా విజ్ఞప్తి పత్రంలోని డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్ల సంతకాలను పరిశీలించి ఆపై అవిశ్వాసం నిర్వహించేందుకు తేదీని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అధికార టీడీపీ, ప్రత్యర్థి వైసీపీలో వేడి మొదలైంది. 54 కార్పొరేటర్ స్థానాల్లో ఒకటి ఖాళీగా ఉండగా 53 డివిజన్లలో నెల్లూరు సిటీలో ఏడుగురు, రూరల్లో ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీకి అనుకూలంగా ఉన్నాయి. మిగిలిన 41 మంది కార్పొరేటర్లు టీడీపీ వైపే ఉన్నారు. మేయర్ మార్పు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

5న మెగా పీటీఎం 3.0

- అన్నీ పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం 3.0)ను విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యాసంస్థల్లో పండగ వాతావరణాన్ని తలపించేలా సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థుల ప్రగతిపైనే ప్రధాన దృష్టి కేంద్రీకరించి, వారి అభ్యున్నతే ధ్యేయంగా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీలు హాజరై పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారన్నారని తెలిపారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలైన సెల్ఫ్ డిఫెన్స్, అసెస్‌మెంట్ బుక్‌లెట్స్, హాలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, కిట్స్ ప్రదర్శనలు చేపడతామని వివరించారు. కార్యక్రమానికి తల్లిదండ్రులంతా హాజరై తమ సూచనలు అందచేయాలని వారు కోరారు.

'కౌసలం' పరీక్షలు ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉద్యోగావకాశం కల్పించడానికి ప్రభుత్వం కౌసలం పేరుతో కొంతకాలం క్రితం సర్వే నిర్వహించింది. అప్పట్లో పేరు నమోదు చేసుకున్న వారి ప్రతిభ, ఉత్సాహాన్ని పరీక్షించి ఉద్యోగావకాశం కల్పించడానికి మంగళవారం నుంచి సచివాలయాలలో పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ పరీక్షలు ఈనెల 6వ తేదీ వరకు జరుగుతాయి. జిల్లాలో కౌసలం సర్వే ద్వారా 1.40 లక్షల మంది నిరుద్యోగులను గుర్తించారు. వీరంతా పరీక్ష రాయడానికి యాప్‌లో తమ సమాచారం ఇచ్చారు. అయితే ఎంతమంది పరీక్ష రాస్తున్నారనేది రాష్ట్ర స్థాయి సమాచారంగా ఉంచారు. జిల్లా స్థాయిలో ఈ సమాచారం లేకపోవడం గమనార్హం.

బంద్ ప్రశాంతం!



నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసిన వామపక్షాలు



నెల్లూరులో వామపక్ష నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సీపీఎం కార్యకర్త పెంచలయ్య హత్యపై ఆగ్రహం

వామపక్షాలతోపాటు కాంగ్రెస్, ఆర్పీఐ నేతల ర్యాలీలు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

లేడీ డాన్ ఆరవ కామాక్షి అనుచరుల చేతిలో హతమైన సీపీఎం కార్యకర్త పెంచలయ్య మృతికి నిరసనగా వామపక్షాలు మంగళవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. నెల్లూరు నగరంతోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లలో సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా బంద్‌లో పాల్గొన్నారు. చాలా చోట్ల వాణిజ్య సంస్థలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద జరిగిన ఆందోళనలో సీపీఎం నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సీపీఎం, సీపీఐలతోపాటు కాంగ్రెస్, స్త్రీ విముక్తి సంఘట న, ఆర్పీఐ నేతలు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. గంజాయి మాఫియాను అరికట్టాలని, పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు. అలాగే, పెంచలయ్య కుటుంబానికి రూ.50 లక్షలతో పాటు రెండు ఎకరాల భూమి, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 6

వైద్య విద్యార్థుల్లో పరివర్తనకు కమిటీలు

- రెండు నెలల్లో ఇద్దరు మెడికోల ఆత్మహత్య బాధాకరం
- 12 మంది విద్యార్థులకో ప్రొఫెసర్ ● వారం వారం నివేదిక
- త్వరలో కమ్యూనిటీ భవనం ప్రారంభం ● రూ.80 కోట్లతో పరికరాల ఏర్పాటు
- మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్
- డీఎంఈ రాకతో డుమ్మా వైద్యుల పరుగో పరుగు

- వివరాలు 6లో..

వైద్య విద్యార్థుల్లో పరివర్తనకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు వచ్చిన ఆయన వైద్య విద్యార్థుల ఆత్మహత్యలపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. కాగా, డీఎంఈ వచ్చారని తెలియడంతో విధులకు డుమ్మా కొట్టిన వైద్యులంతా పరుగున జీజీహెచ్‌కు చేరుకున్నారు.



జీజీహెచ్‌లోని విభాగాలను పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

ఉర్దూ ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు గవర్నమెంట్ హైస్కూల్‌లో ఉర్దూ ఉపాధ్యాయ నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్‌తోపాటు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, టెట్ మార్క్స్, బ్యాంకు, నివాస వివరాలతో డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12231
వెండి కిలో ధర	రూ. 179000
వెండి ఒక గ్రాము	రూ. 184.00

తీరంలో చలిగాలులు

ముత్తుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో మంగళవారం తీర గ్రామాలు చలిగాలుల తాకిడికి గజగజ వణికాయి. ఉదయం నుంచి వర్షం ఒక మోస్తరుగా కురిసినా చలిగాలులు భారీగా వీచాయి. దీంతో ముత్తుకూరు వీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేదు. తీర ప్రాంత గ్రామాలైన కృష్ణపట్నం నేలటూరులో చలిగాలులు తీవ్రత ఎక్కువగా కనిపించింది. దిత్వా తుఫాను తీ రం వెంబడి పయనిస్తున్నందున బుధవారం కూడా చలిగాలులు ఉండవచ్చని భావిస్తున్నారు.

గిరిజనులకు భోజనం పంపిణీ



భోజనం పెడుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న చలివేంద్ర గ్రామ గిరిజనులకు మండల టీడీపీ నాయకులు మంగళవారం మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు రాగల శివకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో చలివేంద్ర గ్రామంలో గిరిజనులు భోజనం సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి స్థానిక తుఫాను షెల్టర్‌లో గిరిజనులందరికీ అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గిరిజనులను ఆదుకుంటున్నామని మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు యాదవ్, గుంజి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృత్తికా దీపోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లి కార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో కృత్తికా దీపోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ చేర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు ఆలయంలో దీపోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

కౌశలం ఆన్‌లైన్ పరీక్షలు



ఆన్‌లైన్ పరీక్షవిధానం పరిశీలిస్తున్న ఎంపీడీవో జలజాక్షి

మనుబోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని సచివాలయాల్లో మంగళవారం కౌశలం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. ఆమె మనుబోలు సచివాలయం-2లో జరుగుతున్న కౌశలం ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీ4 సర్వే కింద స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 140మంది యువకులను ఎంపిక చేశామన్నారు. వీరికి ఒక్కో సచివాలయంలో రోజుకి ఇద్దరు చొప్పున 5రోజుల పాటు 14 సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయన్నారు. రోజుకు మండల వ్యాప్తంగా 28మంది యువతీ,యువకులు ఈ పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షల అనంతరం ఫలితాలను బట్టి యువకులకు ఉద్యోగాల కేటాయింపును ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో అస్తవ్యస్తం

తోటపల్లిగూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి స్థానిక జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు గ్రామాల రహదారులలో వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ఈదూరు హరిజనవాడ కాలనీలలో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలుపడ్డారు.

విజ్ఞాన భాండాగారం.. కోవూరు గ్రంథాలయం



కోవూరులోని శాఖా గ్రంథాలయం



అమ్మో.. ఎన్ని పుస్తకాలో...



కథలన్నీ ఇష్టంగా చదివేస్తాం!

కోవూరు, డిసెంబరు2, (ఆంధ్రజ్యోతి): స్థానిక కాపు వీధిలోని శాఖా గ్రంథాలయం పాఠకుల పాలిట విజ్ఞాన భాండాగారంగా మారింది. గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువతతో పాటు అన్ని వర్గాలకు విజ్ఞానాన్ని పంచుతోంది. ఉదయం, సాయంత్రం పలువురు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఏడాది దాతల సహకారంతో నూతనంగా గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. పచ్చిపాల శంకరరెడ్డి మెమోరియల్ శాఖా గ్రంథాలయంగా పేరు మార్చారు. పురాతన గ్రంథాలతో పాటు అన్ని రంగాలకు చెందిన పుస్తకాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. తెలుగు సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలతో పాటు, విజ్ఞాన, వినోదదాయకమైన పుస్తకాలెన్నో ఉన్నాయి. అపురూపమైన, చారిత్రాత్మక పుస్తకాలను ఇక్కడ భద్రపరిచారు. పాఠకుల సౌలభ్యం కోసం బీరువాల రాకు ల్లో విభాగాల వారీగా పుస్తకాలను చక్కగా అమర్చారు. కేట లాగులో పొందుపరచిన విధంగా పుస్తకాల్ని తీసుకుని అక్కడే చదువుకునే అవకాశముంది. నిత్యం దినపత్రికలు, పుస్తకాలను చదివేందుకు ఇక్కడికి అధికసంఖ్యలో పాఠకు లు వస్తున్నారు.

ఎంతో ఉపయోగం: సురేంద్రరెడ్డి, గ్రంథాలయ బాధ్యులు

శాఖా గ్రంథాలయం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయి. చాలా మంది పత్రికలు చదివేందుకు ఇక్కడికి వస్తుంటారు. లైబ్రరీని అందరికీ ఉపయోగకరంగా తీర్చిదిద్దుతున్నాం.

హంతకులను కఠినంగా శిక్షించాలి!

సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం



ముత్తుకూరు: బంద్‌లో పాల్గొన్న సీపీఎం నాయకులు

పొదలకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య సంఘటనను నిరసిస్తూ మంగళవారం వామపక్ష, ప్రజా సంఘాలు తలపెట్టిన బంద్ విజయవంతమైంది. పొదలకూరు బస్టాండ్ సర్కిల్‌లో సీపీఎం, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అల్లాడి గోపాల్, సీఐటీయూ మండల కార్యదర్శి పంచాయతీ శ్రీనివాసులు మాట్లాడుతూ గంజాయిని పూర్తిగా అరికట్టాలని పెంచలయ్య ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడని, దీంతో గంజాయి బ్యాచ్ కక్ష పెంచుకొని పెంచలయ్యను కిరాతకంగా హత మార్చిన హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గౌరీ, మహేంద్ర, వెంకటేశ్వర్లు, ఎస్సీఎస్టీ నాయకులు పాండు, రషీద్, ఎస్ఎఫ్ఐ నాయకులు మస్తాన్, అనీల్, మోక్ష, సాయి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిలో నిర్వహించిన బంద్‌లో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షేక్ షారూఖ్ ఖాన్ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు గంజాయి, డ్రగ్స్ మాఫియాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, హంతకులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, ఫయాజ్, నెల్లూరు నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు : రాష్ట్రంలో గంజాయి ముఠాలు రాజ్యమేలుతున్నాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోని దయాకర్ అన్నారు. నార్తురాజుపాలెం ప్రధాన కూడలిలో నిరసన చేపట్టారు. గంజాయి ముఠా పెంచలయ్యను హత మార్చడంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా మనుబోలులో సీపీఎం నాయకులు మంగళవారం బంద్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు మూయించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండలకార్యదర్శి తలారి దేవ దానం, ప్రజా సంఘాల నాయకులు బీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : పెంచలయ్య మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నరుకూరు సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజా, నాయకులు బండి సౌరీ, రవణమ్మ, పచ్చ మధు సీఐటీయూ, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : జిల్లాలో గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా సీపీఎం నాయకుడు గడ్డం అంకయ్య డిమాండ్ చేశారు. ముత్తుకూరులో జరిగిన బంద్‌లో సీపీఎం నాయకులు నక్క రాధయ్య, పట్టపు జయరామయ్య, షేక్ మస్తాన్‌బాయ్, గోడ భాస్కర్, కల్లూరు నాగరాజు, మన్నె పద్మమ్మ, ప్రజానాట్య మండలి, ఆవాజ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు



సాయిని సత్కరిస్తున్న జనసేన నాయకుడు రాజేష్

రాపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ క్షేత్రం శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయిని రాపూరు మండల జనసేన నాయకులు మంగళవారం మర్యాద పూ ర్వకంగా కలిశారు. రాపూరు పట్టణానికి చెందిన మండల నాయకులు జల్లెల రాజేష్ నాయకత్వంలో ఆయనను సన్మానించారు. అనంతరం రాపూరు మండలంలోని పుణ్య క్షేత్రమైన పెంచలకోనను సందర్శించాల్సిం దిగా కోరారు. ఈ భేటీలో పలు విషయా లపై చర్చించామని రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు లోకేష్, కూరాకు అశోక్, శివ పాల్గొన్నారు.

కొంచెం.. పట్టించుకోండి గురూ!

అయ్యగారిపాలెం రోడ్డుపై కల్వర్టుకు రంధ్రం



రంధ్రం పడ్డచోట కంచె వేసి అప్రమత్తం చేస్తున్న సర్పంచ్ భర్త నరసయ్య

పొదలకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యగారిపాలెం సమీపంలోని కాలువపై వంతెనను ఆనుకుని ఉన్న రోడ్డుపై పెద్ద గొయ్యి పడింది. కింద నీళ్ల పంటపొలాలకు పోతున్నాయి. పొదలకూరు - సంగం ప్రధాన రహదారి నుంచి అయ్యగారి పాలెం, నందివాయి, అమ్మవారి పాలెం, నావూరు, చెన్నారెడ్డి పల్లి, భోగసముద్రం గ్రామాలకు వెళ్లేవారు నిత్యం ఈ మార్గంలోనే వాహనాలపై తిరుగుతుంటారు. దీంతో ఏ క్షణంలోనైనా ఇక్కడ పెను ప్రమాదం సంభవించవచ్చు. ఈ రంధ్రానికి వెంటనే సం బంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహన చోద కులు కోరుతున్నారు.

5న మెగా పేరెంట్స్ మీటింగ్

మనుబోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన విద్యాశాఖ ఆదేశాలతో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నరేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ మీటింగ్‌ను నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులతో పాటు, కమిటీ సభ్యులను, ప్రజాప్రతినిధులను, నాయకులను కలుపుకుని సమావేశంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని ఎంఈవో తెలియజేశారు. అలాగే 8వ తేదీన ప్రతి ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫేర్, 10వ తేదీన మండలస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించాల్సి ఉంటుంది. దీనికోసం ఉపాధ్యాయులు విద్యార్థులను తయారుచేయాలని సూచించామన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

సీతారామపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మం డలస్థాయి ఆటల పోటీలలో భాగంగా మండల పరిధిలో ని అయ్యవారిపల్లి జడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ ఈ పోటీల్లో 32 మంది పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలైన ఉపాధ్యాయులను జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, ప్రవీణ, హెచ్‌ఎం షఫీఅహమ్మద్, మండల కోఆర్డినేటర్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, బసినేనిపల్లి హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెంలో రక్తదాన శిబిరం

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మండలంలోని గండిపాళెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో జాతీయ సేవా పథకం సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీ న్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరు రక్తదానం చేయాలన్నారు. అనంతరం కళాశాలకు చెందిన విద్యార్థులు, బోధన, బోధనేతర సి బ్బంది 59 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన, నిర్వహించిన వారికి కళాశాల తరుపున ప్రశంసా పత్రాలు అందజేశారు. రక్తదాన కేంద్ర స్ఫూర్తిదాయకులు అరిగల సాయిరాం జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అచార్యులు టీ.గోపీకృష్ణ, రఘునాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు సు నీత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొగిలిచెర్లలోని అవదూత దత్తాత్రేయస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.19,45, 513 ఆదాయం వచ్చింది. కందుకూరు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో హుండీ ద్వారా రూ.14,85,251, అన్నదానం హుండీ ద్వారా రూ.4,62,262 వచ్చినట్టు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు.

'మేజర్' సమస్య కార్మికుల కొరత.. ఊరంతా చెత్త!



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రాపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) వ్యాధులొస్తే వైద్యులు రక్షిస్తారు. అసలు రోగాలు వ్యాప్తి చెందకుండా సమాజాన్ని కాపాడే ప్రయత్నం చేసే వారిలో పారిశుధ్య కార్మికులు ముందు వరుసలో ఉంటారు. ఎంతటి కష్ట కాలంలోనైనా రహదారులను, వీధులను ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తూ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఇపుడు ఉన్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చెయ్యడం, చెత్త తరలించడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ఈ దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. మేజర్ పంచాయతీ పరిధిలో తాత్కాలిక కూలీలపై ఆధారపడి ఉండగా, కొత్త వారిని నియమించుకుని స్వచ్ఛతకు కృషి చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

పది వేల జనాభాకు 12 మంది సిబ్బందా..!?

రాపూరు పంచాయతీ మొత్తం జనాభా పది వేలకు పైచిలుకు. ఈ జనాభా మొత్తానికి 12 మంది పారిశుధ్య సిబ్బంది ఎలా సరిపోతారు అనేది అర్థం కాని విషయం. ప్రతి రోజు రోడ్లు చిమ్మడం, మురిగి కాలువలను తీయడం, తీసిన ఆ మురుగును మళ్ళీ ట్రాక్టర్ కు ఎత్తి పనులు చెయ్యడం వంటివి వీరికి పనికి మించిన భారంగా మారింది. అసలు పంచాయతీలో చెత్త కుండీలు ఏర్పాటు అసలే లేకుండా పోయాయి. ఇళ్ల మధ్యన చెత్త అస్తవ్యస్తంగా విసిరి వేస్తున్నందున దాన్ని తొలగించడం తలకు మించిన భారం అవుతుంది అంతే కాకుండా ఈ పంచాయతీలో మొత్తంగా 100 కు పైగా డ్రైన్లు ఉండగా, వాటి శుభ్రత ఈ కొంత మంది సిబ్బందితో సాధ్యమయ్యే పనికాదు. పక్కన ఉన్న పొదలకూరు పంచాయతీలో సుమారు 40 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. కానీ రాపూరు పంచాయతీలో కనీసం 25 మంది అయినా ఉంటే పారిశుధ్య విషయంలో స్వచ్ఛత పాటించే అవకాశముంది. దీనికి తోడు వీరి జీతాలు కూడా ప్రతి రోజుకి రూ.300 దినసరి వేతనం కావడం, అవి కూడా వచ్చిన రోజుకు మాత్రమే ఇచ్చే పరిస్థితి నెలకొనడంతో కొత్త వారు చేరే అవకాశం సమస్యగా మారింది. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమన్వయ లోపం ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇకనైనా పంచాయతీ పారిశుధ్య కార్మికుల విషయంలో పాలకులు, అధికారులు దృష్టి పెట్టి, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలని ప్రజలు భావిస్తున్నారు.

వర్షాల వేళ.. పంటల సంరక్షణ ఎలా!?

- రైతులకు విస్తరణ విభాగం శాస్త్రవేత్త సూచనలు
- రబీలో ముమ్మరంగా పైర్ల సాగు



వర్షాలకు నీటమునిగిన వరి

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ పంటలు ఊపందుకున్నాయి. ఇప్పటికే దాదాపు 3458 హెక్టార్లలో వరినార్లు పోసుకున్నారు. 41 హెక్టార్లలో వరి విత్తనాలు చల్లారు. 157 హెక్టార్లలో జొన్న, 102 హెక్టార్లలో మొక్కజొన్న సాగులో ఉంది. ఇంకా 22 హెక్టార్లలో పెసర, 1265 హెక్టార్లలో మినుము, 442 హెక్టార్లలో కం ది, 832 హెక్టార్లలో శనగలు, 581 హెక్టార్లలో వేరుశనగ కూడా సాగు లో ఉన్నాయి. ఈక్రమంలో జిల్లాలో తుఫాన్ ప్రభావంతో రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో పంటల సంరక్షణకు సంబంధించి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. లోకేష్‌బాబు రైతులకు పలు సూచనలను ఆంధ్రజ్యోతి ద్వారా తెలియజేశారు.



డాక్టర్ ఎస్. లోకేష్ బాబు, విస్తరణ విభాగం శాస్త్రవేత్త

● **వరి:** నారుమడిలో ఉన్న నారు, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నపుడు మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలకశాతం ఘననీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసేయాలి. దీని వల్ల ఎలాంటి నష్టం ఉండ దు. నీరు తీసే మార్గం లేకపోతే తప్పనిసరిగా తిరిగి విత్తనం చల్లుకోవాలి. అ లాగే 7 నుంచి 30రోజుల మధ్యలో నారుమడిలో 5రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఎక్కువ. 5 రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. నష్టనివారణకు నీటిని తీసేసిన తరువాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది. తెగుళ్ల బారిన పడకుండా మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదంటే రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి. పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసేసి పైపాటుగా ఎకరాకు 20కిలోల యూరియా 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి. ఈవిధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నిలిచిన నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేలా బాటలు ఏర్పాటు చేసుకోవాలి.

● **శనగ, మినుము, పెసర**

నీరు నిల్వ ఉండే పొలాల్లో వెంటనే నీటిని బయటకు పంపాలి. ఐరన్ లోపం నివారణకు ఫెరస్ సల్ఫేట్ 5గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, 20గ్రాముల యూరియాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వారం తరువాత 1శాతం 19:19:19 లేదంటే కేఎన్‌ఓ3 స్ప్రే చేయాలి. రూట్ రాట్ ఆకుమచ్చ వంటి వ్యాధుల నియంత్రణకు హెక్సాకోనాజోల్ 2మి.లీ లేదంటే ప్రోపికొనాజోల్ 1మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. మినుము, పెసర పంటలకు వర్షం ఆగిన వారం తరువాత మారుకా పాడ్ బోరర్ నివారణకు క్లోర్ పైరిఫాస్ 2.5మి.లీ లేదంటే నోవాలురాన్ 1మి.లీ లీటరు నీటితో కలిపి స్ప్రే చేయాలి.

● **వేరుశనగ :** విత్తిన 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం తగ్గుతుంది. ఈదశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసేయాలి. దీంతో ఎలాంటి నష్టం జరగదు. నీరు తీయడానికి వీలులేకపోతే మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం వేసుకోవాలి.

● **చిరు ధాన్యపు పైర్లు:**

జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటల్లో వర్షం నీటిని వీలైనంత తొందరగా పొలం నుంచి బయటకు పోయే ఏర్పాటు చేసుకోవాలి. జొన్న పంట పూత, గింజ ఏర్పడే దశలో ఉన్నప్పుడు బూజు తెగులు రాకుండా నివారించేందుకు ప్రొపైకోనాజోల్ అనే శిలీంద్రనాశక మందును 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి కంకులపై రెండు సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పంట పొలంపైన వాలిపోయినప్పుడు మొక్కలను పైకి జరిపి గుంపుగా నిలబెట్టుకుని కాపాడుకోవాలి. పంట కోతకు వచ్చినప్పుడు ఆలస్యం లేకుండా పంట కోత చేసుకోవాలి. రాగి, కొర్ర పంటల్లో అగ్గి తెగులును నివారించేందుకు కార్బన్‌డిజం ఒక గ్రాము లేదంటే ట్రై సైక్లోజోల్ 0.5గ్రాములు లీటరు నీటికి కలుపుకుని మొక్క బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని ఆయన వివరించారు.

రైతులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

● కలెక్టర్ హిమాన్షు శుక్లా

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలతో రైతులు, ప్రజలకు ఇబ్బందులు పడకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. వర్షాల కారణంగా జరిగిన నష్టాలను గురించి తెలుసుకునేందుకు మంగళవారం కావలికి చేరుకుని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ, జలవనరులు, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కువగా వర్షాలు కావలి, బోగోలు, దగదర్తి, జలదంకి మండలాల్లో పడినందున కావలి ప్రాంతంలో నష్టాలపై అడిగి తెలుసుకున్నారు. పెద్దగా పంట నష్టాలు లేక పోయినా అక్కడక్కడా నారుమళ్లు, వరి నాట్లు దెబ్బతిన్నట్లు చెపుతున్నారని, పొలాల్లో ఉన్న నీటిని తగ్గిస్తే చాలా వరకు ఆ పంటలు కూడా దెబ్బతిన కుండా ఉంటాయని అధికారులు సూచించారు. కావలి మండలంలోని ముసునూరు, చెన్నాయపాలెం, ఆనెమడుగు చెరువులకు వచ్చే వాగులు, వరద కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ కారణంగా నీరు చెరువులకు రాకుండా పొలాల్లోకి చేరడంతో పంటలు మునిగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే ఆయా చెరువులకు వచ్చే వాగులు, కాలువలలో జంగిల్ క్లియరెన్స్‌కు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి కోసం వచ్చి..

● గండిపాళెంలో వలస కూలీ గల్లంతు



సౌరభ్‌కుమార్ (ఫైల్)

ఉదయగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని రాష్ట్రాలు దాటి వచ్చాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యావసర వస్తువు కోసం పక్క గ్రామానికి తోటి కూలీతో కలిసి వెళ్లాడు. సమీపంలో ఉన్న జలాశయాన్ని చూసేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో పడి గల్లంతైన ఘటన గండిపాళెం జలాశయంలో మంగళవారం జరిగింది. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ జిల్లా సగన్వకి చెందిన సౌరభ్‌కుమార్(24), ఆస్తోస్‌లు ఉపాధి కోసం బెంగళూరుకు వచ్చి పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బెంగళూరులో స్థిరపడ్డ వరికుంటపాడు మండలం గువ్వాడికి చెందిన ప్రసాద్‌రావు ఇంటికి పెయింటింగ్ చేసేందుకు అతని వద్ద పని చేస్తున్న, గండిపాళెంకి చెందిన బెంజిమన్, వారిద్దరు వారం రోజుల క్రితం వచ్చారు. మంగళవారం సరుకుల కోసం ముగ్గురు గండిపాళెంకి వచ్చారు. సరుకులు కొన్నాక సమీపంలో ఉన్న జలాశయం చూసేందుకు వెళ్లి మెట్ల దారి గుండా నీటి వద్దకు వెళ్లారు. సౌరభ్‌కుమార్ పెయింట్‌ను శుభ్రం చేస్తు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. మిగిలినవారు కేకలు వేయడంతో అక్కడే ఉన్న మత్స్యకారులు నీటిలో దిగి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. జలాశయం నీటి లోతు అధికంగా ఉండడంతో గల్లంతైన అతని ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అల శ్రీను సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 665



రాజరాజేశ్వరి ఆలయం సుందరేశ్వరస్వామి సన్నిధిలో నందీశ్వరుడికి విశేష అలంకరణ

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయం, రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

'గిరిజన మహిళను పదవి నుంచి దించడం సరికాదు'

నెల్లూరు(సిటీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గిరిజనులకు రాజకీయంగా రాకరాక అవకాశమొస్తే కొందరు మేయర్‌పై అవిశ్వాసం పెట్టడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవిశ్వాస తీర్మానం టీడీపీ సిద్ధాంతాలకు విరుద్ధమని తెలిపారు. కొందరి వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం పార్టీని బలిచేస్తున్నారని ఆరోపించారు. అవిశ్వాస తీర్మానంతో ప్రజాప్రతినిధులందరికీ చెడ్డపేరు వస్తుందని వెల్లడించారు.

సాయం కాదు.. ప్రోత్సాహం కావాలి!

- దివ్యాంగులకు సరైన అవకాశాలు అవసరం
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఒక మనిషికి చేతులు లేకపోవచ్చు... కాళ్లు పనిచేయకపోవచ్చు... కళ్లు కనపడక పోవచ్చు, చెవులు వినిపించకపోవచ్చు. కానీ, వారి కలలు మాత్రం ఒక్కచోటే ఆగిపోవు. అవయవలోపం ఉన్నప్పటికీ వారిలో అలౌకిక శక్తి ఉంటుంది. అదే ఆలంబనగా, ప్రతి అడుగూ పోరాటంగా జీవనం సాగిస్తారు. అన్నీ అంగాలు సక్రమంగా ఉన్నవారికి తాము ఏ మాత్రం తీసిపోమని, అవిటితనం ప్రతిభకు అడ్డుకాదని చాటుతూ వివిధ రంగాల్లో దూసుకుపోతున్నారు.



నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులలో ప్రతిభను ప్రోత్సహించడానికి, వారి హక్కులు, సమస్యలు, సమాజ బాధ్యతలు గుర్తు చేయడానికి ప్రతీ ఏటా డిసెంబరు 3వ తేదీన అంతర్జాతీ య దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుతారు. దీనిని 1992లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా ప్రకటించింది. టోక్యో పారా ఒలింపిక్స్‌లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన దివ్యాంగ క్రీడాకారులు దేశం గర్వించేలా పతకాలు సాధించారు. టెక్నాలజీ రంగంలో ఏఐ, డిజిటల్ టూల్స్‌తో పనిచేస్తూ వేలాది మంది వికలాంగులు ఉద్యోగాలు సాధిస్తున్నారు. దివ్యాంగులను కుటుంబ సభ్యులతోపాటు పాఠశాలలు, కార్యాలయాల్లో సానుభూతితో కాక, సమాన భావంతో చూడాల్సిన అవసరం ఉంది. వికలాంగులకు కావలసినది సాయం కాదు.. సరైన అవకాశమని సమాజంలో ప్రతీ ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉంది.

సామాజిక పింఛన్లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి వరకు దివ్యాంగులకు ఇస్తున్న రూ.4 వేల సామాజిక పింఛను మొత్తాన్ని రూ.6వేలకు పెంచింది. దీంతో వారి జీవన మనుగడకు భరోసా ఏర్పడింది. వారి కోసం పలు సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తోంది. కాగా, జిల్లాలో సుమారు 70వేల మంది దివ్యాంగులు ఉన్నారని అంచనా. 31,913 మందికి ప్రభుత్వం వైకల్య పింఛన్లు అందచేస్తోంది.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకని గత శనివారం జిల్లా దివ్యాంగులశాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. షాట్ పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహించారు. వాటిలో గెలుపొందిన వారికి ఈనెల 10వ తేదీన బహుమతులు, జ్ఞాపికలు అందచేయనున్నారు.



క్రీడా పోటీలలో దివ్యాంగులు(ఫైల్)

సంక్షేమానికి కృషి



దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటోంది. వారికి పథకాలు అందేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ల ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం.

- అత్తర్ ఆయూబ్, ఏడీ, దివ్యాంగుల సంక్షేమశాఖ

పెంచలయ్యకు ఘన నివాళి

- రూరల్ ఎమ్మెల్యే శ్రద్ధాంజలి
- పొట్టేపాళెం వద్ద సీపీఎం రాస్తోరోకో
- ఆర్డీటీ కాలనీవాసుల పాదయాత్ర

నెల్లూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గంజాయి వ్యతిరేక ఉద్యమంలో మాఫియా చేతిలో హత్యకు గురైన పెంచలయ్యకు అన్నీ పక్షాలు ఘన నివాళి అర్పించాయి. సీపీఎం పిలుపుతో మంగళవారం నిర్వహించిన బంద్‌కు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో పెంచలయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయన సాధనకు కృషి చేస్తామని ప్రకటించారు. పెంచలయ్య కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం నాయకులు పొట్టేపాళెం వద్ద జొన్నవాడ రహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. పెంచలయ్యను బలితీసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని, గంజాయి ముఠాల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పొట్టేపాళెం చంద్రమౌళి, పూడిపర్తి జనార్దన్, ఆలూరు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కాగా, తమ ప్రాంతవాసిని గంజాయి ముఠా పొట్టనపెట్టుకుందని, నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ కల్లూరుపల్లి ఆర్డీటీ కాలనీ వాసులు పాదయాత్ర నిర్వహించారు. ఆ కాలనీ నుంచి పడారుపల్లి వరకు నడిచివచ్చి అక్కడ్నుంచి వాహనాల్లో నగరంలో జరిగిన బంద్‌లో పాల్గొన్నారు. బంద్ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.



పొట్టేపాళెం వద్ద రాస్తోరోకో చేస్తున్న సీపీఎం నాయకులు



పెంచలయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పెంచలయ్య కుటుంబానికి జనసేన పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని మంగళవారం జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. పెంచలయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. పార్టీ నాయకుడు గునుకుల కిషోర్ మాట్లాడుతూ గంజాయి ముఠా దాష్టీకానికి బలైన పెంచలయ్య కటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. పెంచలయ్య ఆశయాలను ముందుకు తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకు లు సుధాకర్, ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్, నరహరి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పెంచలయ్య కుటుంబంతో మాట్లాడుతున్న జనసేన నాయకుడు గునుకుల కిషోర్

వర్షాలతో మురుగు ఇబ్బందులు రానివ్వొద్దు

- నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు మురుగు ఇబ్బందులు రానివ్వొద్దని కార్పొరేషన్ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రధాన, చిన్న తరహా డ్రైన్లను ఆయన పరిశీలించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్లపై నీళ్లు నిలవకుండా బయటకు పంపాలని యంత్రాంగానికి సూచించారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, నివాసాల వద్ద మురుగు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం రెవెన్యూ విభాగంతో సమీక్ష జరిపారు. పన్నుల మొండి బకాయిదారులకు లోక్ అదాలత్ నోటీసులివ్వాలని, స్పందించని వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. డీ-ఫారం పట్టాలను గుర్తించి వాటన్నిటికీ పన్ను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు, టీపీఆర్వో వాసు బాబు పాల్గొన్నారు.



కాలువలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్

ఎన్‌సీసీ ద్వారా డ్రోన్ శిక్షణ

నెల్లూరు(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ 10ఏ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో డ్రోన్ ట్రైనింగ్ ప్రారంభించారు. కమాండింగ్ ఆఫీసర్ గణేష్ మాట్లాడుతూ ఏపీలో తొలిసారి ఎన్‌సీసీ ద్వారా డ్రోన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 200 మంది కేడెట్స్‌ను ఎంపిక చేసి, తర్ఫీదుకు ఏర్పాట్లు చేశామన్నారు. డ్రోన్ తయారీ, పనితీరు, విని యోగం, ఉపయోగం తదితరాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ నాయుడు మాట్లాడుతూ తమ కళాశాలలో డ్రోన్ శిక్షణ సెంటర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కేడెట్స్‌తోపాటు విద్యార్థులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ జే మహేష్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, మెకానికల్ విభాగం హెడ్ డాక్టర్ ఏవీఎస్ శ్రీధర్, పీడీ ప్రసాద్, ఏజీఎం టీవీ శ్రీధర్, ఏవో వరప్రసాద్, సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.



డ్రోన్ శిక్షణ కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, కళాశాల ప్రతినిధులు

కష్టపడే వారికి మంచి భవిష్యత్తు

- నగర డివిజన్ల టీడీపీ నేతలతో మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 28 డివిజన్లకు సంబంధించి ఇటీవల బాధ్యతలు చేపట్టిన నాయకులతో మంగళవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని వారితో ప్రమాణం చేయించారు. నాయకులు డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలలో చెప్పిన దానికంటే ఎక్కువగా పనులు చేసి చూపిస్తానన్నారు. కార్యకర్తల సంక్షేమానికి ఏడాదికి రూ. 10 కోట్లు సొంత నిధులు కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్, తహసీన్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి తదిరులు పాల్గొన్నారు.



నాయకులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి నారాయణ

ఉత్సాహంగా పెన్‌కాక్ సిలాట్ పోటీలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్‌లో మంగళవారం అస్మిత ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పెన్‌కాక్‌సిలాట్ క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. పలు జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీరామ్, సీఐ శాంతిరామ్‌రెడ్డి, పెన్‌కాక్ సిలాట్ సౌత్‌జోన్ కార్యదర్శి విజయభరద్వాజ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మనోజ్‌సాయి, జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి డీ ప్రసాద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కొత్త పంచాయతీలకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపాక కనీసం 30కిపైగా కొత్త పంచాయతీలు ఏర్పడే అవకాశమున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా, వీటికి అదనంగా కొత్త పంచాయతీలు వచ్చి చేరనున్నాయి. ఇదే జరిగితే రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరగనుంది. అనేక మంది రాజకీయ ఆశావహులకు అవకాశం దక్కుతుంది. సర్పంచ్ స్థానాలతోపాటు వందల వార్డు స్థానాల్లో కొత్తగా వందల సంఖ్యలో ప్రజాప్రతినిధులు కొలువుతీరనున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలకు పాలనా పరంగా కూడా కష్టాలు తొలగుతాయి. వారి గ్రామాల్లోనే పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటవుతాయి.

రూ.35 లక్షలతో అంబేడ్కర్ భవన్

నెల్లూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : పేదలు, సామాన్యుల అవసరాల కోసం నగరంలోని 33వ డివిజన్ నేతాజీనగర్‌లో రూ. 35 లక్షలతో అంబేడ్కర్ భవన్ నిర్మిస్తున్నట్లు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆ నిర్మాణ పనులను మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. భవనం త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాగా, రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 24 కుటుంబాలకు రూ. 16 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం హజరత్‌నాయుడు, జలదంకి సుధాకర్, పెంచలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీలో ఇద్దరు కార్పొరేటర్ల చేరిక

నగరంలో వైసీపీకి చెందిన 38వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత, ఆమె భర్త రాజేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

పశువుల్లో ముద్ద చర్మ వ్యాధిపై అప్రమత్తత అవసరం

అమరావతి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) అంటువ్యాధిగా వ్యాపిస్తోంది. దోమలు, ఈగలు, ఇతర కీటకాల ద్వారా వ్యాప్తి చెందే ముద్ద చర్మ వ్యాధి పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ హెచ్చరించింది. వ్యాధి సంక్రమించిన 2-3 రోజులు జ్వరంతో ప్రారంభమై, శరీరంపై కణుతులు, కణజాలం ఏర్పడి, పశువుల కండరాలపై ప్రభావం చూపుతాయి. వ్యాధి సోకిన 2-3 వారాల్లో కోలుకున్నా.. కొన్ని వారాల పాటు పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో మరణాల రేటు 5%లోపే ఉన్నా.. దూడలపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా దేశవాళీ రకం పశువుల కన్నా.. సంకర జాతి పశువుల్లో వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుంది. పాడి పశువుల్లో ముద్ద చర్మవ్యాధి లక్షణాలు కనిపించగానే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. 3నెలలపైన వయస్సున్న పశువులకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశుసంవర్ధకశాఖ ఉచితంగా టీకాలు వేస్తోంది. నెల తర్వాత తప్పకుండా బూస్టర్ డోస్, తదుపరి ఏడాదిలో మరోసారి ఈ టీకా వేయించాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనారోగ్యంతో ఉన్న పశువులను దూరంగా ఉంచాలని, వ్యాధి ప్రభావిత గ్రామాలకు, పశుసంరక్షణ కేంద్రాలకు వీటిని తీసుకెళ్లరాదని సూచించారు.

10న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకుని డిసెంబరు 3వ తేదీన వెంకటాచలంలోని సీఆర్సీ సెంటర్‌లో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందచేసే కార్యక్రమం వర్షాల కారణంగా ఈనెల 10వ తేదీకి వాయిదా పడినట్లు టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి సెంటర్లలో 2003లో ఎంపికైన దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు, వీల్‌ఛైర్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, చంక కర్రలు, చదువుకునే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు 10న అందచేస్తారని, దివ్యాంగులు ఈ విషయంను గమనించుకోవాలని పేర్కొన్నారు.

ఎస్ఏ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కావలి(టౌన్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖాళీగా ఉన్న 7 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు విద్యా వలంటీర్లతో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వ అనుమతి లభించిందని మండల విద్యా శాఖాధికారి గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు హైస్కూల్స్, ఒక యూపీ స్కూల్‌లో సోషల్, సంస్కృతం, ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 5 తేదీ సాయంత్రం లోపల దరఖాస్తులను కావలి ఎమ్మార్సీలకు సమర్పించాలని పేర్కొన్నారు.

● **కందుకూరు :** ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులలో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో ఎం.నాగకుమారశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని దూబగుంటలో ఎస్జీటీ, పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్), ఖాజీపాలెం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఉర్దూ) పోస్టులకు అర్హులైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వదలని వాన వామపక్షం బంద్

తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా విడవని వాన ఒకవైపు, వామపక్ష నాయకుడి హత్యకు నిరసనగా ఎర్రజెండాల బంద్ మరోవైపు.... వెరసి నెల్లూరు నగరం మంగళవారం నిర్మానుష్యంగా మారింది. విడతల వారీగా రోజంతా వానపడుతుండటం, దానికి తోడు చలిగాలి వీస్తుండటంతో నగర రోడ్లపై జనాలు పలుచబడ్డారు. అదేసమయంలో బంద్ కారణంగా విద్యాలయాలు, దుకాణాలు మూసివేయడం, వాహన రాకపోకలు లేకపోవడంతో ట్రంకురోడ్డు, వీఆర్సీ సెంటర్ వంటి ప్రధాన వ్యాపార ప్రాంతాలు కూడా జన సంచారం లేక బోసిపోయాయి.





ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





ఎప్పుడూ వాహనాలు, పాదచారులతో రద్దీగా ఉండే గాంధీబొమ్మ, లీలామహల్ సెంటర్లు వీడని వర్షం, బంద్‌తో ఇలా నిర్మానుష్యంగా మారాయి

జిల్లాలో టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం ఆమోదం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తారకేశ్వర టెక్స్‌టైల్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి పబిత్ర మర్గరెటా చెప్పారు. మంగళవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు గురించి ప్రశ్నించినప్పుడు మంత్రి ఈ విధంగా సమాధానం ఇచ్చారు. ఆ ప్రాజెక్టు వ్యయం రూ.103.44 కోట్లని, 2275 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రంలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసి, రెండేళ్ల అనుభవం, నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన మహిళలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 5వతేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో దరఖాస్తును నేరుగా అందచేయాలని, పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వామపక్షాల బంద్ ప్రశాంతం

● జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల మూసివేత ● నెల్లూరులో నేతల నిరసన ప్రదర్శన
● మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారానికి డిమాండ్



నెల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్షాలు


నెల్లూరు నగరంలో మూతపడిన దుకాణాలు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో సీపీఎం కార్యకర్త పెంచలయ్య దారుణహత్యకు నిరసనగా మంగళవారం వామపక్షాలు నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ బంద్‌లో వామపక్షాలతో పాటు వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కూడా బంద్‌కు సంఘీభావం తెలియచేసి, స్వచ్ఛందంగా మూసివేశాయి. నెల్లూరుతో పాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ కేంద్రాల్లో కూడా వామపక్షాల నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. సీపీఎం, సీపీఐతో పాటు కాంగ్రెస్ పార్టీ, స్త్రీ విముక్తి సంఘం, ఆర్‌పీఐ ఈ బంద్‌లో పాల్గొని పెంచలయ్య హత్యపై నిరసన తెలిపాయి. సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ కూడా ఆజాద్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నగరంలోని గాంధీబొమ్మ వద్ద జరిగిన నిరసనలో కొంత ఉద్రికత్త చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ను స్తంభింప చేసిన పార్టీ నేత కత్తి శ్రీనివాసులుతోపాటు కొంత మందిని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పార్టీ నేతలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీబొమ్మ నుంచి ఆర్టీసీ వరకు వామపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, అరిగెల సాయి మాట్లాడారు. గంజాయి ముఠా కారణంగా హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రూ. 50 లక్షల నష్టపరిహారంతో పాటు 2 ఎకరాల భూమి, పెంచలయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గంజాయి ముఠాను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి కొండమ్మ మాట్లాడుతూ గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని పాలకులు చెబుతున్నా, అవి సేవిస్తున్న వారు ఇలా హత్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, సీపీఎం నేతలు మోహన్‌రావు, మదాల వెంకటేశ్వర్లు, సీపీఐ నేతలు రామరాజు, షాన్‌వాజ్, కాంగ్రెస్ నేత సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్రాణి



కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టరు ఇంద్రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టరు శకుంతల అనారోగ్య కారణాలతో ఆ బాధ్యతల నుంచి తప్పుకోగా ఇంద్రాణిని సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలోనూ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వైద్య విద్యార్థుల్లో పరివర్తనకు కమిటీలు

● రెండు నెలల్లో ఇద్దరు మెడికోల ఆత్మహత్య బాధాకరం ● త్వరలో కమ్యూనిటీ భవనం ప్రారంభం ● రూ.80 కోట్లతో పరికరాల ఏర్పాటు
● మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్


వైద్య విద్యార్థులు, వైద్యులతో సమావేశమైన డీఎంఈ డాక్టర్ రఘునందన్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు నెలల వ్యవధిలో ఇద్దరు వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని, విద్యార్థుల్లో పరివర్తనకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు వచ్చారు. వైద్య విద్యార్థుల ఆత్మహత్యలపై ఆరా తీశారు. పలు సూచనలు సూచించారు.

● ప్రత్యేక కమిటీలు

వైద్య కళాశాలలో 700 మంది విద్యార్థులు ఉన్నారని, 12 మంది విద్యార్థులకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ చొప్పున కమిటీలు ఏర్పాటు చేస్తామని డీఎంఈ రఘునందన్ తెలిపారు. ఆ ప్రొఫెసర్ విద్యార్థుల మానసిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులు తెలుసుకుని వారానికి ఓ నివేదికను అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్‌కు ఇస్తారన్నారు. ఆ నివేదికలను ప్రతీ నెల ప్రిన్సిపాల్‌కు అందచేస్తారని చెప్పారు. ఆ తర్వాత వాటిని డీఎంఈకి పంపుతారని తెలిపారు. ఈ క్రమంలో వైద్య విద్యార్థుల్లో మార్పునకు కృషి జరుగుతుందన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కమ్యూనిటీ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తారని, అందులో ట్రామాకేర్ విభాగం ఏర్పాటు చేస్తామన్నారు. రూ. 80 కోట్లతో జీజీహెచ్ సూపర్ స్పెషాలిటీలో వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైద్యులు కూడా సక్రమంగా ఆసుపత్రిలో సేవలు అందించేలా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కాగా, డీఎంఈ ముందుగా జీజీహెచ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. లోపాలు సరిదిద్దుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెన్‌హర్, డిప్యూటీ కలెక్టర్ పరమేశ్వరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

● వైద్యుల పరుగో పరుగు

జీజీహెచ్‌లో పలువురు వైద్యులు ఎప్పటిలాగే మంగళవారం కూడా విధులకు డుమ్మా కొట్టారు. అయితే డీఎంఈ డాక్టర్ రఘునందన్ జీజీహెచ్‌కు వచ్చారని తెలియడంతో వారంతా పరుగున జీజీహెచ్‌కు చేరుకోవటం విశేషం.

హమ్మయ్యా..!

● తుఫాన్ ముప్పు తప్పడంతో ఊపిరి పీల్చుకున్న రైతాంగం

నెల్లూరు(వ్యవసాయం) : దిత్వా తుఫాను రైతాంగం భయాందోళనకు గురిచేసినా రెండ్రోజులకు ప్రభావం తగ్గడంతో ఊపిరిపీల్చుకుంది. రబీ సీజన్ ప్రారంభంలో ప్రతి ఏడాది ఏదో ఒక తుపాను రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ ఏడాది దిత్వా తుఫాను అన్నదాతలపై ప్రభావం ఉంటుందని అందరూ భావించినా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా దాదాపు 16,069 హెక్టార్లలో వరి నాట్లు వేసి ఉన్నారు. 3,075 హెక్టార్లలో పప్పు ధాన్యాలు, 581 హెక్టార్లలో వేరుశగన పంట మొలకదశలో ఉంది. రబీ సీజన్ ఊపందుకునే సమయంలో జిల్లాలో దిత్వా తుఫాను కారణంగా వర్షాలు మొదలయ్యాయి. రెండ్రోజులపాటు ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 100 హెక్టార్లలో వరినాట్లు, 20 హెక్టార్లలో నారుమడి నీటమునిగాయి. కొడవలూరులో 24 హెక్టార్లలో నాట్లు, 10 హెక్టార్లలో నారుమడి, కావలిలో 16 హెక్టార్లలో నాట్లు, 32 హెక్టార్లలో నారుమడి, కోవూరులో 48 హెక్టార్లలో నాట్లు, 9 హెక్టార్లలో నారు, సంగం మండలంలో 20 హెక్టార్లలో నాట్లు, 10 హెక్టార్లలో నారుమడి మొత్తంగా ఈ ఐదు మండలాల్లోని 26 గ్రామాల్లో 333 మంది రైతులకు చెందిన 81 హెక్టార్లలో వరినారు, 208 హెక్టార్లలో వరిపైరు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. పంటలను కాపాడుకునేందుకు కాలువలు ఏర్పాటు చేసి నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అయితే మంగళవారం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో ఊపిరిపీల్చుకున్నారు. పొలాల్లో చేరిన నీరు బయటకు పోయేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవడంతో పంట దెబ్బతినే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మరో రెండ్రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందించే అవకాశం ఉంది.

● సోమశిలలో 69.635 టీఎంసీల నీరు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి మంగళవారం 12,288 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 69.635 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో..

రాపూరు : కండలేరు డ్యాంలో 58.69 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 5100 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 1090 క్యూసెక్కులు, సత్యసాయి కాలువకు 850, పిన్నేరు వాగుకు 10, ఫస్ట్ బ్రాంచ్ కాలువకు 75, రాపూరు తాగు నీటి పథకానికి 5 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.


సంగంలో ముంపునకు గురైన పొలాలు

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.


అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గోట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు

సంగం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సుల (వ్యాన్‌ల) ఫిట్‌నెస్‌పై ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, అత్యవసర ద్వారం పనితీరు తనిఖీ చేశారు. అనంతరం నిబంధనల గురించి డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భద్రతా మార్గ దర్శకాలను ఇటు యాజమాన్యాలు, అటు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12231
వెండి కిలో ధర	రూ. 179000
వెండి ఒక గ్రాము	రూ. 184.00

5న మెగా పీటీఎం

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (మెగా పీటీఎం) సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారన్నారు. సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికలు అందజేయడంతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం, పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. అలాగే మనబడి-మన భవిష్యత్తు నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయులు లీప్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

నేడు గంధమహోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకులోని హజరత్ ఖాజా అబుల్ ఫైజ్‌షా మహ్మద్‌ఖాలిది వజూది షంషీ గంధ మహోత్సవాన్ని ఉదయగిరిలోని ఆస్థాన-ఎ-ఖాదరియా నిర్వాహకులు బుధవారం నిర్వహిస్తున్నటు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంధం ఆస్థాన నుంచి బయలుదేరి పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా చేపట్టి అనంతరం ఆస్థానాకు చేరుతుందని పేర్కొన్నారు. రాత్రికి మహఫిలే సమా కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

అధ్వానంగా ప్రధాన రహదారి

కలువాయి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలువాయిలో మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. దిత్వా తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు ఛిద్రమైంది. రోడ్డుపై భారీ గోతులు పడ్డాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో కొంతమేర సిమెంటు రోడ్డు వేశారు. అయితే ఈ రోడ్డు అసంపూర్తిగా ఉంది. ఇంకా కిలోమీటరు మేర ఉన్న తారు రోడ్డు తరచూ దెబ్బతింటోంది. రోడ్లు, భవనాలశాఖాధికారులు వెంటనే స్పందించి పూర్తిగా సిమెంటు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోండి

ఏఎస్ పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు. ప్రస్తుతం మండలంలో ఎక్కువగా నారుమడులు వేశారని, 5 నుండి 30 రోజుల మధ్య నారుమడులలో ఉన్న నీటిని 5 రోజులలో పూర్తిగా తొలగించాలని తెలిపారు.

సాగు పద్ధతుల్లో మార్పు రావాలి

మర్రిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నేడు మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు సూచించారు. మంగళవారం మర్రిపాడు సచివాలయంలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. పంటకు విలువ పెరగటానికి, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్ కవిత, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రాటకొండ సుబ్బయ్య, రైతుసంఘం నాయకులు వెంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య పరీక్ష

వింజమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కౌశలం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిరుద్యోగ యువతకు ఆన్‌లైన్ ద్వారా నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వింజమూరు-2, వింజమూరు-5 సచివాలయాల్లో జరుగుతున్న పరీక్షను ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు.

పరిశుభ్రత పట్టదా...?


రహదారి పక్కన అపరిశుభ్రత

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనకాలువ సమీపంలో ప్రధాన రహదారిపై అపరిశుభ్రత నెలకొనడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా రహదారికిరువైపులా ప్రవహిస్తుండడం, దుర్గభరితంగా మారడంతో ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. మరోవైపు మురుగు రహదారిపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ముంపునకు గురైన పొలాలు : గండి కొట్టి, నీటి తరలింపు


గండి కొట్టడంతో కాలువలోకి వెళ్తున్న వర్షపునీరు

సంగం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నారెడ్డిపాళెంలోని పొలాలతోపాటు బీసీ కాలనీ, ఉన్నత పాఠశాలలో భారీగా వర్షపు నీరు చేరింది. వర్షపు నేరు వెళ్లే బుడ్డి డ్రైనేజిలో కొన్నేళ్ల నుండి పూడిక తీయకపోవడంతో డ్రైన్ పూడిపోయి వర్షపునీరు వెళ్లే మార్గం లేక పొలాలు ముంపునకు గురయ్యాయి. వరి నాట్లు మునిగిపోయాయి. బీసీ కాలనీతోపాటు ఉన్నత పాఠశాల ఆవరణలో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరింది. దీంతో గ్రామస్థులు స్పందించి సదరన్ చానల్ కాలువ గట్టుకు ఎక్స్‌కవేటర్‌తో గండి కొట్టి వర్షపు నీటని సదరన్ కాలువ లోకి వదిలారు. ప్రతి ఏటా వర్షాకాలం ఇదే పరిస్థితి ఉంటోంది. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి ఏటా కాలువకు గండి కొట్టడం.. తరువాత ఇరిగేషన్ అధికారులు గండి పూడ్చుకోవడం జరుగుతోంది తప్ప శాశ్వత పరిష్కారం చేపట్టడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఆనం

ఆత్మకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. తుఫాను వల్ల దెబ్బతిన్న రహదారులు, డ్రైన్లను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, కమిషనర్ గంగా ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, అధికారులు పాల్గొన్నారు.

● పేదల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత

పేదల ఆరోగ్య భద్రతకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకే సీఎం సహాయ నిధి నుంచి రూ. కోట్లు మంజూరు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో 28 మంది బాధితులకు రూ. 35.21 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలోనే గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 565 మందికి రూ. 5.72 కోట్లు మంజూరు చేశారన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి


ఆత్మకూరులో బంద్ చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత పెంచలయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆత్మకూరు సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం పార్టీ పిలుపు మేరకు నెల్లూరులో జరిగిన సీపీఎం నేత పెంచలయ్య హత్యను నిరసిస్తూ మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోకు ఎదురుగా తెల్లవారుజాము నుంచే సీపీఎం నేతలు బంద్ చేశారు. ఆర్టీసీ బస్సులను డిపో నుంచి బయటకు రానీయకుండా ఆందోళన చేశారు. పట్టణంలో దుకాణాలను మూసివేశారు. బంద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకునింది. బంద్‌కు సహకరించాలని సీపీఎం నేతలు పోలీసులను వేడుకున్నారు. ప్రశాంతంగా బంద్ నిర్వహించుకోవాలని ఆందోళనకారులకు పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ పెంచలయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, జిల్లాలో గంజాయి మాఫియాను అరికట్టాలని లేని పక్షంలో తాము ఆందోళన తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మర్రిపాడులో సీపీఎం నిరసన

ఏఎస్ పేట : సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు వ్యతిరేకంగా మండల సీపీఎం నాయకులు మంగళవారం ఏఎస్‌పేటలో ర్యాలీ నిర్వహించారు. హంతకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మొగల్ నిసార్ అహ్మద్, నాయకులు గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు : పెంచలయ్య హత్యకు నిరసనగా సీపీఎం నాయకులు మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. హంతకులను ఖఠినంగా శిక్షించాలని రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి రహంతుల్లా, మహిళా నాయకురాలు శ్యామలమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : సీపీఎం సభ్యుడు పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అనంతసాగరంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలు మూయించి నిరసన తెలిపారు. గంజాయి ముఠాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, సద్దా రవీంద్రరెడ్డి, బాబు, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు


క్రికెట్ ఆడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి ఆటల పోటీలలో భాగంగా మండల పరిధిలోని అయ్యావారిపల్లి జడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ నిత్యం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో తలమునకలయ్యే ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా ,మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ పోటీల్లో 32 మంది పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలైన ఉపాధ్యాయులను జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, ప్రవీణ, హెచ్ఎం షఫీఅహమ్మద్, మండల కోఆర్డినేటర్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, బసినేనిపల్లి హెచ్.ఎం.తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా తుమ్మచెట్ల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు ఇరువైపులా తుమ్మచెట్లను తొలగింపజేస్తున్న పంచాయతీ కార్యదర్శి రవీంద్ర

సీతారామపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి హైవే కూడలి వరకు రోడ్డు మార్జిన్‌లో తుమ్మచెట్లు ఉన్నాయి.వీటివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శి పీ. రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తుమ్మచెట్లను తొలగించారు. రోడ్డు మార్జిన్ ఇరువైపులా మట్టితో లెవలింగ్ చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రోడ్డు మార్జిన్ దెబ్బతిన్నడం, తుమ్మచెట్లు రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. తుమ్మచెట్లను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు.ఈ విషయాన్ని సర్పంచు భాగ్యకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి పంచాయతీ కార్యదర్శి ద్వారా పనులు చేయించారని తెలిపారు.

ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న ఐదు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు ఉర్దూ, రెండు స్కూల్ అసిస్టెంట్ ఎస్టీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 5వ తేదీలోపు ఎంఈవో కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతలు పరిశీలించి 6న ఎంపిక చేసి 8వ తేదీన విధులకు హాజరు కావాల్సి ఉందన్నారు. కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● దుత్తలూరు మండలంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో-2 వెంగయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నందిపాడు, రాచవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్, ఎస్టీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైనవారు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువత



ఉదయగిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్న పెంచలయ్యను నెల్లూరులో గంజాయ్ ముఠా దారుణంగా హత్య చేయడంపై ఉదయగిరిలో సీపీఎం నాయకులు, ప్రజా సంఘాలతో కలిసి పంచాయతీ బస్టాండ్ నుంచి మెయిన్‌బజార్ మీదుగా ఆర్టీసీ డిపో వరకు నినాదాలతో కూడిన నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. వారికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో యువతను గంజాయి బానిసలుగా చేస్తున్నారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు, హత్యలు, చోరీలు అధికమయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటరావు, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శీను, రఘునాథ్‌లు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కోడె రమణయ్య, ఫరుద్దీన్‌బాషా, కామాక్షమ్మ, నాయబ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

ఉదయగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి మాట్లాడుతూ హెచ్ఐవీ నిర్మూలనకు సమష్టి కృషి అవసరమన్నారు. హెచ్ఐవీ విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. చెడు వ్యసనాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కేసీ విక్రమ్, అన్సారీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మండలంలోని గండిపాళెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో జాతీయ సేవా పథకం సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరు రక్తదానం చేయాలన్నారు. అనంతరం కళాశాలకు చెందిన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది 59 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన, నిర్వహించిన వారికి కళాశాల తరుపున ప్రశంసాపత్రాలు అందజేశారు. రక్తదాన కేంద్ర స్ఫూర్తిదాయకులు అరిగల సాయిరాం జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచార్యులు టీ.గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు సునీత, వెంకటేశ్వర్లు, హెచ్ఎం రవీంద్ర, వైద్యులు బాలభారతి, గిరినాగహరీష్, సందీప్‌కుమార్, సాంకేతిక నిపుణులు శ్రీనివాసులు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రైతన్న మీ కోసం'

వింజమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండెమడకలలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఏ.వాసు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొని రైతుల నికర ఆదాయం పెరుగుటకు వర్క్‌షాపు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ సాంకేతిక సుస్థిర, సమగ్ర వ్యవసాయ ప్రణాళికపై చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

వర్షాల వేళ.. పంటల సంరక్షణ ఎలా!?

● రైతులకు విస్తరణ విభాగం శాస్త్రవేత్త సూచనలు
● రబీలో ముమ్మరంగా పైర్ల సాగు


వర్షాలకు నీటమునిగిన వరి

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ పంటలు ఊపందుకున్నాయి. ఇప్పటికే దాదాపు 3458 హెక్టార్లలో వరినార్లు పోసుకున్నారు. 41 హెక్టార్లలో వరి విత్తనాలు చల్లారు. 157 హెక్టార్లలో జొన్న, 102 హెక్టార్లలో మొక్కజొన్న సాగులో ఉంది. ఇంకా 22 హెక్టార్లలో పెసర, 1265 హెక్టార్లలో మినుము, 442 హెక్టార్లలో కంది, 832 హెక్టార్లలో శనగలు, 581 హెక్టార్లలో వేరుశనగ కూడా సాగు లో ఉన్నాయి. ఈక్రమంలో జిల్లాలో తుఫాన్ ప్రభావంతో రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో పంటల సంరక్షణకు సంబంధించి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. లోకేష్‌బాబు రైతులకు పలు సూచనలను ఆంధ్రజ్యోతి ద్వారా తెలియజేశారు.


డాక్టర్ ఎస్. లోకేష్ బాబు, విస్తరణ విభాగం శాస్త్రవేత్త

● **వరి:** నారుమడిలో ఉన్న నారు, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నపుడు మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలకశాతం ఘననీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసేయాలి. దీని వల్ల ఎలాంటి నష్టం ఉండదు. నీరు తీసే మార్గం లేకపోతే తప్పనిసరిగా తిరిగి విత్తనం చల్లుకోవాలి. అలాగే 7 నుంచి 30రోజుల మధ్యలో నారుమడిలో 5రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఎక్కువ. 5 రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. నష్టనివారణకు నీటిని తీసేసిన తరువాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది. తెగుళ్ల బారిన పడకుండా మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదంటే రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి. పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసేసి పైపాటుగా ఎకరాకు 20కిలోల యూరియా 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి. ఈవిధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నిలిచిన నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేలా బాటలు ఏర్పాటు చేసుకోవాలి.

● శనగ, మినుము, పెసర

నీరు నిల్వ ఉండే పొలాల్లో వెంటనే నీటిని బయటకు పంపాలి. ఐరన్ లోపం నివారణకు ఫెరస్ సల్ఫేట్ 5గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, 20గ్రాముల యూరియాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వారం తరువాత 1శాతం 19:19:19 లేదంటే కేఎన్‌ఓ3 స్ప్రే చేయాలి. రూట్ రాట్ ఆకుమచ్చ వంటి వ్యాధుల నియంత్రణకు హెక్సాకోనాజోల్ 2మి.లీ లేదంటే ప్రోపికొనాజోల్ 1మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. మినుము, పెసర పంటలకు వర్షం ఆగిన వారం తరువాత మారుకా పాడ్ బోరర్ నివారణకు క్లోర్ పైరిఫాస్ 2.5మి.లీ లేదంటే నోవాలురాన్ 1మి.లీ లీటరు నీటితో కలిపి స్ప్రే చేయాలి.

● **వేరుశనగ :** విత్తిన 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం తగ్గుతుంది. ఈదశలో వీలైనంత తొందరగా నీటిని పూరన్తిగా బయటకు తీసేయాలి. దీంతో ఎలాంటి నష్టం జరగదు. నీరు తీయడానికి వీలులేకపోతే మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం వేసుకోవాలి.

● చిరు ధాన్యపు పైర్లు

జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటల్లో వర్షం నీటిని వీలైనంత తొందరగా పొలం నుంచి బయటకు పోయే ఏర్పాటు చేసుకోవాలి. జొన్న పంట పూత, గింజ ఏర్పడే దశలో ఉన్నప్పుడు బూజు తెగులు రాకుండా నివారించేందుకు ప్రొపైకోనాజోలు అనే శిలీంద్రనాశక మందును 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి కంకులపై రెండు సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పంట పొలంపైన వాలిపోయినప్పుడు మొక్కలను పైకి జరిపి గుంపుగా నిలబెట్టుకుని కాపాడుకోవాలి. పంట కోతకు వచ్చినప్పుడు ఆలస్యం లేకుండా పంట కోత చేసుకోవాలి. రాగి, కొర్ర పంటల్లో అగ్గి తెగులును నివారించేందుకు కార్బన్‌డిజం ఒక గ్రాము లేదంటే ట్రై సైక్లోజోల్ 0.5గ్రాములు లీటరు నీటికి కలుపుకుని మొక్క బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలని ఆయన వివరించారు.

రైతులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

● కలెక్టర్ హిమాన్షు శుక్లా

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలతో రైతులు, ప్రజలకు ఇబ్బందులు పడకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. వర్షాల కారణంగా జరిగిన నష్టాలను గురించి తెలుసుకునేందుకు మంగళవారం కావలికి చేరుకుని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, జలవనరులు, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కువగా వర్షాలు కావలి, బోగోలు, దగదర్తి, జలదంకి మండలాల్లో పడినందున కావలి ప్రాంతంలో నష్టాలపై అడిగి తెలుసుకున్నారు. పెద్దగా పంట నష్టాలు లేక పోయినా అక్కడక్కడా నారుమళ్లు, వరి నాట్లు దెబ్బతిన్నట్లు చెపుతున్నారని, పొలాల్లో ఉన్న నీటిని తగ్గిస్తే చాలా వరకు ఆ పంటలు కూడా దెబ్బతిన కుండా ఉంటాయని అధికారులు సూచించారు. కావలి మండలంలోని ముసునూరు, చెన్నాయపాలెం, ఆనెమడుగు చెరువులకు వచ్చే వాగులు, వరవ కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ కారణంగా నీరు చెరువులకు రాకుండా పొలాల్లోకి చేరడంతో పంటలు మునిగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే ఆయా చెరువులకు వచ్చే వాగులు, కాలువలలో జంగిల్ క్లియరెన్స్‌కు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి కోసం వచ్చి..

●గండిపాళెంలో వలస కూలీ గల్లంతు


సౌరభ్‌కుమార్ (ఫైల్)

ఉదయగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని రాష్ట్రాలు దాటి వచ్చాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యావసర వస్తువు కోసం పక్క గ్రామానికి తోటి కూలీతో కలిసి వెళ్లాడు. సమీపంలో ఉన్న జలాశయాన్ని చూసేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో పడి గల్లంతైన ఘటన గండిపాళెం జలాశయంలో మంగళవారం జరిగింది. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ జిల్లా సగన్వకి చెందిన సౌరభ్‌కుమార్(24), ఆస్తోస్‌లు ఉపాధి కోసం బెంగళూరుకు వచ్చి పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బెంగళూరులో స్థిరపడ్డ వరికుంటపాడు మండలం గువ్వాడికి చెందిన ప్రసాద్‌రావు ఇంటికి పెయింటింగ్ చేసేందుకు అతని వద్ద పని చేస్తున్న, గండిపాళెంకి చెందిన బెంజిమన్, వారిద్దరు వారం రోజుల క్రితం వచ్చారు. మంగళవారం సరుకుల కోసం ముగ్గురు గండిపాళెంకి వచ్చారు. సరుకులు కొన్నాక సమీపంలో ఉన్న జలాశయం చూసేందుకు వెళ్లి మెట్ల దారి గుండా నీటి వద్దకు వెళ్లారు. సౌరభ్‌కుమార్ పెయింట్‌ను శుభ్రం చేస్తు ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. మిగిలినవారు కేకలు వేయడంతో అక్కడే ఉన్న మత్స్యకారులు నీటిలో దిగి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. జలాశయం నీటి లోతు అధికంగా ఉండడంతో గల్లంతైన అతని ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అల శ్రీను సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 665

11వ వసంతంలోకి సమరసతా సేవ ఫౌండేషన్

కలిగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ మూలాలను కాపాడుతూ మారుమూల గ్రామాలకు కూడా హిందూ ధర్మాన్ని చేరవేస్తూ హైందవులను ఏకతాటిపై నడిపిస్తున్న ప్రచార వేదిక సమరసతా సేవ ఫౌండేషన్ 11వ వసంతంలోకి అడుగుపెట్టిందని కలిగిరి మండల ధర్మప్రచారక్ కర్రా బాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో దళిత, గిరిజన, మత్స్యకార తదితర ప్రాంతాల్లో టీటీడీ ఆధ్వర్యంలో 822 ఆలయాల నిర్మాణాలకు సహకారం అందించడంతోపాటు ఐదుగు బలహీన వర్గాలవారిని అర్చకులుగా నియమించడంలో తమ సంస్థ ఎంతగానో కృషి చేసిందన్నారు. హిందూ ధర్మప్రచారానికి, అన్యమత ప్రచార నిరోధానికి, అన్నమత వ్యాప్తి నివారించడంలో సహకారం అందించిన సమరసతా సేవాసంస్థ సభ్యులకు, హిందువులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటూరికి సన్మానం


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎంతవేలు

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి తప్పించి తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా ఎంతవేలు ఎం.నాగకుమారశర్మ, కేసుబ్బారెడ్డిలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందుకూరుకు 120 కి.మీటర్ల దూరంలో ఉన్న నెల్లూరులో కలపటం వల్ల ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారని, ప్రజలకు ఇచ్చిన మాటమేరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శతవిధాలా ప్రయత్నించి తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేలా చూడటంలో సఫలీకృతుడయ్యాడని ప్రశంసించారు. ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు, ప్రజలకు కష్టాలు తప్పేలా సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

భవనాల రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ లేకుండా నిర్మించుకున్న భవనాలు, ప్లాన్‌ను అతిక్రమించి నిర్మించిన భవనాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్ స్కీంను ప్రవేశపెట్టినందున భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి నిర్మించుకుని ఉన్న అన్ని అనధికార భవనాలను రెగ్యులరైజ్ చేసుకోవచ్చునని ఆమె తెలిపారు. భవనాల రెగ్యులరైజేషన్‌కు 120రోజులు సమయం ఇచ్చినందున మార్చి 11లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రెగ్యులరైజ్ చేసుకున్న భవనాలకు అన్నివిన్నట్లో అదనపు పెనాల్టీని రద్దు చేస్తామని తెలిపారు.

10న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని డిసెంబరు 3వ తేదీన వెంకటాచలంలోని సీఆర్పీ సెంటర్‌లో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందచేసే కార్యక్రమం వర్షం కారణంగా ఈనెల 10వ తేదీకి వాయిదా పడినట్లు టీడీపీ దివ్యాంగుల విభాగం ప్రతినిధి మండవ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి సెంటర్లలో 2003లో ఎంపికైన దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, చంక కర్రలు, చదువుకునే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు 10న అందచేస్తారని, దివ్యాంగులు ఈ విషయాన్ని గమనించుకోవాలని పేర్కొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీలోని నగదు లెక్కిస్తున్న సిబ్బంది

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలోని అవధూత దత్తాత్రేయస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.19.45,513 ఆదాయం వచ్చింది. కందుకూరు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో ఆలయ హుండీ ద్వారా రూ.14,85,251, అన్నదానం హుండీ ద్వారా రూ.4,62,262 ఆదాయం వచ్చినట్లు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు. ఇది 8 నెలల కాలానికి సంబంధించినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది, అర్చకులు, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా చిరుజల్లులు

లింగసముద్రం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో మూడు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చిరుజల్లులకు మండలంలోని పలు గ్రామాలలోని రోడ్లపై ఓ మోస్తరుగా వర్షపు నీరు నిలిచింది. అంతేకాక గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. లింగసముద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల వర్షపు నీరు నిలవడంతో వాహనాలు వచ్చినప్పుడు ఆ నీరు జనాలపై పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ వర్షాలు ప్రస్తుతం రైతులు సాగు చేసిన పొగాకు, పొగాకు, వరినాట్లు, జామాయిలు పైర్లకు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు.

వాగుల్లో అడ్డంకుల తొలగింపు


కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు, చెన్నాయపాలెం, అనెమడుగు చెరువులకు వచ్చే వాగులు, వరవలలో అక్కడక్కడా చెట్లు, మట్టి అడ్డుగా ఉండటంతో పొలాలు నీట మునక అవుతున్నాయని గుర్తించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా వాటిని తొలగించాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఆదేశాలు వచ్చిన గంటల వ్యవధిలోనే మంగళవారం పాయంత్రం జలవనరులశాఖ ఇన్‌ఛార్జి ఈఈ ఖాన్ ఆధ్వర్యంలో ఏఈలు, సిబ్బంది వాగుల వంకలలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు చేపట్టారు. చెన్నాయపాలెం చెరువుకు నీరువెళ్లే గుండమ్మ వాగులో, గుమ్మడి బొందల వద్ద ఉన్న వరవకాలువలలో ఉన్న ఆటంకాలను కొంత తొలగించారు. ముసునూరు చెరువుకు నీరు వచ్చే పిల్లి వాగులో ఉన్న ఆటంకాలను కొంత తొలగించడంతో వర్ష పొలాల్లో నీరు తగ్గుముఖం పడుతుందని అధికారులు చెప్తున్నారు. బుధవారం పూర్తిస్థాయిలో నీటి మునక కున్న అడ్డంకులను తొలగిస్తామని అధికారులు తెలిపారు.

చలిగాలులకు ప్రజలు విలవిల

అల్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ బలహీనపడినప్పటికీ మంగళవారం వాతావరణంలో చల్లదనం కారణంగా ప్రజలు, మూగజీవులు విలవిల్లాడుతున్నాయి. చలిగాలుల తీవ్రత పెరిగింది. దీంతో చిన్న పాటి వర్షంతోపాటు చలి తీవ్రత అధికమవడంతో వృద్ధులు, చిన్నారులు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. బయటికి వస్తే చలిగాలి ఎముకలు కొరికే విధంగా ఉండటంతో ప్రజలు ఇంట్లోనే ఉంటున్నారు. ఇదే వాతావరణం రెండు రోజులపాటు కొనసాగే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న తరుణంలో వరినాట్లు కూలీలు రాకపోవడంతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపు నీరు నిల్వ చేరి వ్యవసాయ పనులు కుంటుపడ్డాయని రైతులు అంటున్నారు. వరినాట్లు వేసుకునేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

కొత్త పంచాయతీలకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపాక కనీసం 30కిపైగా కొత్త పంచాయతీలు ఏర్పడే అవకాశమున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా, వీటికి అదనంగా కొత్త పంచాయతీలు వచ్చి చేరనున్నాయి. ఇది జరిగితే రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరగనుంది. అనేక మంది రాజకీయ ఆశావహులకు అవకాశం దక్కుతుంది. సర్పంచ్ స్థానంతో పాటు వందల వార్డు స్థానాల్లో కొత్తగా వందల సంఖ్యలో ప్రజాప్రతినిధులు కొలువుదీరనున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలకు పాలనా పరంగా కూడా కష్టాలు తొలగనున్నాయి. వారి గ్రామాల్లోనే పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటవుతాయి.

వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత!

- ఇబ్బందులు పడుతున్న రైతాంగం
- ఉన్నతాధికారుల చర్యలు శూన్యం
- పట్టించుకోని పాలకులు

అల్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధారిత ప్రాంతమైన మండలంలో వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక నగర పంచాయతీతో పాటు 10 పంచాయతీలకు సంబంధించి అధికారికంగా, అనధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల్లో వరి సాగు చేపడుతారు. ఈ క్రమంలో గత వైసీపీ పాలనలో వీఏవో (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) అంటూ గ్రామ పరిధిలో అధికారులను ఏర్పాటు చేసి రైతులందరికీ నిత్యం అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అందులో ఒక విభాగాన్ని వ్యవసాయశాఖకు కేటాయించారు. ఈ క్రమంలో గతంలో 13 పంచాయతీలుగా ఉన్న మండలంలో 13 పంచాయతీలకు సంబంధించి దాదాపు 10 మందికి పైగా వీఏవోలు విధులు నిర్వర్తించారు.

- నగర పంచాయతీతోనే సమస్య

13 పంచాయతీలుగా ఉన్న మండలంలో గత వైసీపీలో అల్లూరు, సింగపేట, నార్తుమోహూరు గ్రామాలను కలుపుతూ నగర పంచాయతీని చేయాలనే భావించిన ఆనాటి నాయకులు చేసిన పనితో నేడు అన్ని విభాగాల్లో తీవ్ర సమస్య ఎదుర్కోవలసి వస్తుంది. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడిన అల్లూరును నగర పంచాయతీగా చేయడంతో ఈ మూడు గ్రామాల్లో వీఏవో పోస్టులను తొలగించారు. దీంతో అల్లూరులో వ్యవసాయ భూమి అధికంగా ఉండడంతో మిగిలిన రూరల్ గ్రామాల్లో వీఏవోలుగా కేవలం నలుగురు మిగిలారు. ఇందుపూరు, ఇస్కపల్లి, గ్రద్దగుంట, గోగులపల్లి సచివాలయాల్లో మాత్రమే వారు విధులు నిర్వర్తిస్తున్నారు.

- ఈ-క్రాప్ నమోదుకు ఇబ్బందులు

మండలంలో దాదాపు 40 వేల ఎకరాల్లో వరిసాగు చేపడుతున్న క్రమంలో రబీ సీజనులో ఈ-క్రాప్ నమోదు చేయాలంటే ఇది జరిగే పనికాదంటూ అటు అధికారుల్లో కొంతమంది, రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముగ్గురితో సాధ్యపడదని రైతులు


అల్లూరు వ్యవసాయ శాఖ కార్యాలయం

అంటున్నారు. అధికార మండల పరిధిలోని వేల ఎకరాలు సాగు చేస్తున్న రైతులు తమ వ్యవసాయాధారిత సమస్యలు పరిష్కరించుకోవాలన్నా, ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నా, సలహాలు సూచనలు పొందాలన్నా వ్యవసాయ అధికారులు అవసరమవుతారు. ఈ క్రమంలో రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ఉన్నతాధికారుల చర్యలు శూన్యం

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరిసాగు చేసే ప్రాంతాల్లో మండలానిది కీలక పాత్ర. ఇక్కడి యాజమాన్య పద్ధతులు ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తుంటారు. ఇటువంటి మండలంలో వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత ఉన్న విషయం ఉన్నతాధికారులకు తెలిసినా, వారి పర్యటనల్లో కళ్లారా చూసినా ఏటువంటి చర్యలు తీసుకోకపోవడం కనీసం ఇతరులను ఇక్కడ తాత్కాలికంగా నియమించే విషయంలో నిర్లక్ష్యం వహించడంతో ఉన్నవారిపై పనిభారం తీవ్రతరంగా ఉంది.

- పట్టించుకోని పాలకులు

మండలంలో ఏటువంటి సమస్యలు లేకుండా అధికారుల ద్వారా పనులు చేయించే పాలకులు మండలాన్ని విస్మరిస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభంలోనే యూరియా పంపిణీ కార్యల విషయంలో కనీసం ఆ శాఖాధికారులకు సహకరించిన నాయకులు కారణంగా పరిస్థితి జఠిలంగా మారుతోంది. ఈ విషయం కావలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కనీసం చర్యలు తీసుకోకపోవడంతో ఇంకెవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో రబీ సీజనులో ఏర్పడే సమస్యలను దృష్టిలో ఉంచుకొని సచివాలయ సిబ్బంది నియమించాలని స్థానిక రైతాంగం కోరుతున్నారు.

వాడవాడలా కదం తొక్కిన ఎర్ర సైన్యం


కావలి(టౌన్) : ఆర్టీసీ వద్ద మానవహారం



గుడ్లూరు : ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

కావలి(టౌన్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత పెంచలయ్య హత్యను నిరసనగా వామపక్షాల జిల్లా బంద్‌కు ఇచ్చిన పిలుపులో భాగంగా వాడవాడలా ఎర్ర సైన్యం కదం తొక్కింది. వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ఎమ్మార్పీఎస్ శ్రేణులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలనుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. బీపీఎస్ కూడలి వరకు సాగిన ర్యాలీ తిరిగి ఆర్టీసీ కూడలికి చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విద్యా సంస్థలు పూర్తిగా మూతబడ్డాయి. నెల్లూరు ప్రెస్ పోతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా కారు రాస్తారోకోలో చిక్కుకోవడంతో పోలీసులు కలెక్టర్ కారుకు మార్గం వదిలి పంపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, నాయకులు నాగరాజు, దర్శనాలు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరవది బాస్కర్, సీపీఐఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి, శ్యామల, ఎమ్మార్పీఎస్ నాయకులు జీవెంకటేశ్వర్లు, చేపూరు కిరణ్, సంఘాల నాయకులు వినీల్, సునీల్, కృష్ణమోహన్, వెంకయ్య, మధుసూదన్‌రావు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

- **అల్లూరు** : గంజాయి, మాదకద్రవ్యాలు సేవించే, విక్రయించే ముఠాల కారణంగా సీపీఎం పార్టీ కార్యకర్త, ప్రజా నాట్యమండలి కళాకారుడు పెంచలయ్య ప్రాణాలు కోల్పోయాడని ఇటువంటి ముఠాలను నిర్మూలం చేయాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పెంచలయ్యను గంజాయి ముఠా దారుణంగా నరికి చంపినందుకు నిరసనగా చేపట్టిన జిల్లావ్యాప్త బంద్‌లో భాగంగా మండలంలో సీపీఎం, సీఐటీయూ, వామపక్షాలు, ప్రజాసంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ముందుగా విద్యాసంస్థలు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు మూయించివేశారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటి బాస్కర్, షేక్ రషీద్, విజయలక్ష్మి, వెంకట రమణమ్మ, రమణయ్య, పెంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.
- **జలదంకి** : గంజాయి మాఫియా చేతిలో దారుణహత్యకు గురైన కామ్రేడ్ పెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు రావి మాల్యాద్రి, తాళ్లూరి మాల్యాద్రిల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు ఎర్రజెండాలు చేతబూని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, బ్యాంకులను మూయించివేశారు. అనంతరం జలదంకి బస్టాండు కూడలిలో రాస్తారోకో చేశారు. ఈ బంద్‌లో నాయకులు మేలంగి ఆంథోనీబాబు, గద్దం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.
- **గుడ్లూరు** : నెల్లూరులో సీపీఎం నేత పెంచలయ్య హత్యను ఖండిస్తూ గుడ్లూరులో సీపీఎం ఆధ్వర్యంలో వర్తకుల స్వచ్ఛంద బంద్ నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సులను కొంతసేపు ఆపి నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు, లింగసముద్రం మండలాల కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు, నాయకులు గుత్తి మల్లికార్జున, కొట్టే వెంకయ్య, దామ కృష్ణయ్య, నేలటూరి తిరుపాలు, బాలకోటయ్య, దాసరి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.
- **విడవలూరు** : యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న గంజాయి మాఫియాపై కఠిన చర్యలు చేపట్టాలని, పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు నేత తుమ్మల వెంకయ్య డిమాండ్ చేశారు. బోగోలు మండలం ఇజ్రాయిల్‌పేటలోని సీపీఎం కార్యాలయం నుంచి బోగోలు బజారు వరకు సీపీఎం, సీఐటీయూ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్‌బాషా, అన్వర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- **ఉలవపాడు** : సీపీఎం కార్యకర్తను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఉలవపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీవీవీ కుమార్, నాయకులు కత్తి సుజాత, మిరియం శ్రీనివాసులు, ఆర్.మోహన్, దాసరి వెంకట్రావు, కొమరగిరి వెంకటేశ్వర్లు, రవి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయకా... ఇంకెన్నాళ్లు ఇలా..!?

- వర్షం వస్తే నేరెళ్లవాగుపై రాకపోకలు బంద్
- వంతెన నిర్మించాలని చామదల వాసుల వేడుకోలు

జలదంకి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాయకులారా... ఇంకా ఎన్నేళ్లు మేము వర్షాలొస్తే ఊరికే పరిమితం కావాలి. మాగ్రామానికి రాకపోకలు సజావుగా సాగేలా బ్రాహ్మణక్రాక-చిట్టగుంట మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై నేరెళ్లవాగుకు వంతెన నిర్మించాలంటూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లను మండలంలోని చామదలప్రజలు వేడుకుంటున్నారు. గత నెలలో మొంథా తుఫాన్ సమయంలో ఇదే వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి చెందిన దంపూరు మల్లికార్జున కూలి పనికి వెళ్లి రాత్రివేళ వాగు దాటుతూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. గతంలో ఇలా ఇంకొందరు వాగుదాటుతూ మృత్యువాత పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. వర్షాలొస్తే గ్రామానికి పరిమితం కావాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. 5వేల మంది ప్రజలు నివసించే మాగ్రామానికి వచ్చే రోడ్డుపై వంతెన నిర్మించపోవడం దారుణమంటున్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నేరెళ్లవాగుకు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు బ్రాహ్మణక్రాక-బోగోలు ఆర్అండ్‌బీ రోడ్డుపై ముళ్లకంప అడ్డంగా వేసి రాకపోకలను అడ్డుకున్నారు. వర్షం వచ్చిన ప్రతీ సారి ఇదే పరిస్థితి నెలకొంటుందని, పాలకులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి నేరెళ్లవాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


నేరెళ్లవాగు మార్గంలో రోడ్డుపై అడ్డంగా వేసిన ముళ్లకంప

తలసేమియా బాధిత చిన్నారులకు చేయూత


చేయూతనిచ్చిన వారిని సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారులకు తమవంతు చేయూతనందిస్తామని కావలి సబ్ జైళ్లో కార్యాలయ సీనియర్ సహాయకులు ఒగ్గు విజయకుమార్, (గ్రీన్‌హ్యాండ్స్) స్వచ్ఛందసంస్థ అధ్యక్షులు వేమూరి గాయత్రి, విశ్రాంత ఉపాధ్యాయులు కోనేటి మార్కండేయులు, సీతారామయ్యలు ముందుకు వచ్చారు. ఈ మేరకు మంగళవారం కావలి రెడ్‌క్రాస్ డేకేర్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రక్త మార్పిడి చేయించుకున్న తలసేమియా చిన్నారులతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్వహకులు వారి చేతుల మీదుగా మందులు, పౌష్టికాహారం అందచేశారు. తలసేమియా డేకేర్ సెంటర్ వైద్యాధికారి పామూరు శ్రీధర్, కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, జిల్లా పాలకమండలి స సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కావలి పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, గాదిరెడ్డి హరినారపరెడ్డి, కల్లయ్య, రజనీ పాల్గొన్నారు.

ఎస్ఏ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కావలి(టౌన్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖాళీగా ఉన్న 7 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు విద్యా వలంటీర్లతో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వ అనుమతి లభించిందని మండల విద్యా శాఖాధికారి గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు హైస్కూల్స్, ఒక యాపీ స్కూల్‌లో సోషల్, సంస్కృతం, ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 5 తేదీ సాయంత్రంలోపల దరఖాస్తులను కావలి ఎమ్మార్సీలకు సమర్పించాలని పేర్కొన్నారు.

- **కొండాపురం** : మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు జిల్లా విద్యాశాఖ తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కొరకు నోటిఫికేషన్ విడుదలచేసినట్లు ఎంఈవో-2 ఆనందరావు మంగళవారం తెలిపారు. మర్రిగుంట ఉన్నత పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్ పోస్టు-1, వెంగళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ సబ్జెక్టులో పాఠశాల సహాయకులు పోస్టు-1 ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 5వ తేదీలోగా తమ కార్యాలయంలో అందచేయాలన్నారు.
- **విడవలూరు** : బోగోలు మండలం బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో జయమ్మ తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు అర్హత ఉన్నవారు ఈనెల 5వ తేదీ సాయంత్రంలోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు.
- **కందుకూరు** : ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో ఎం.నాగరాజుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని దూబగుంట ఎస్టీటీలి, పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్), బాణిపాలెం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఉర్దూ) పోస్టులకు అర్హులైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తల్లిదండ్రుల సంరక్షణ చట్టం అమలు చేయాలి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న మల్లి

కావలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ప్రగడ్బందీగా అమలు చేయాలని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్‌మల్లి కోరారు. వర్షాలనడుమ నేపథ్యంలో సమీక్షించేందుకు మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందచేశారు. తల్లిదండ్రుల ఆస్తులు రాయించుకుంటున్న పిల్లలు వారిని చూడకుండా బయటకు గెంటివేస్తున్నారన్నారు. దీంతో ఇది సామాజిక సమస్యగా మారిందన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం అలాంటి పిల్లలపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తెలుసుకుని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి అక్కడ న్యాయం జరుగునట్లు పోతే తమకు ఆపేలుంటే చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు సుబ్బారావు, కే.నరసింహారావు, హరిబాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరినాట్లు, నారుమడులు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి

బిట్రగుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావం వలన పలు ప్రాంతాల్లో వంటపోలాలు చెరువులను తలపిస్తున్నాయి. బిట్రగుంట పంచాయతీలో దాదాపు 500 ఎకరాలకు సంబంధించిన వరినారుమడులు నీట మునిగాయి. సుమారు 70 ఎకరాల వరి నాట్లు నీట మునిగాయి. బందికి మండలం చామదల చెరువు కలుజు నీరు, పైనుంచి వచ్చేవర్షపు నీరు ప్రవహించే పులకాలువ ఆక్రమణకు గురి కావడంతో పంట పొలాలో నీళ్లు నిలిచి పోయాయని రైతులు అంటున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఏవో శైలజలు వేర్వేరుగా వివిధ ప్రాంతాల్లో పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు నాయకుడు వాకా శివమహేశ్వరెడ్డి, స్థానిక రైతులు కొప్పోలు శ్రీనివాసులురెడ్డి, మోర్ల వెంకటేశ్వర్లు, పొదిలి రామచంద్రయ్య, వీఆర్వో చందు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో జాతీయ కాలుష్య నివారణ దినం

బిట్రగుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా సివిల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ రెడ్డి, ఆర్‌ఆర్‌రమణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంబీఏ సీనియర్ అధ్యాపకుడు బీశ్రీకాంతరెడ్డి జాతీయ కాలుష్య నివారణపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్య సేవ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, సివిల్ విభాగం అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ వివరాల సేకరణ


స్థల యజమానుల పేర్లు నమోదు చేసుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

కలిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు 167 బీజీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి రెవెన్యూ సిబ్బంది మంగళవారం వివరాలు సేకరించారు. హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణం వరకు ఖాళీ స్థలం, దుకాణాలు, భవన యజమానుల వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శేషయ్య, బీఆర్ఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చినుకు రాలితే బురదమయం


పాఠశాల ప్రాంగణం వద్ద నీరు

కావలి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చినుకు రాలితే మండలంలోని వెంకుగానిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రాంగణం వద్ద బురదమయంగా మారుతుంది. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పాటు వర్షపు నీరు పాఠశాలకు తూర్పువైపున పొలాల్లోకి పోతుండగా ఆ పొలం లో రైతులు మట్టితోలుకోవడంతో వర్షపు నీరు పాఠశాలకు దక్షిణం వైపున పొలాల్లో ఉండే గుంటకు వెళ్తోంది. ఆ గుంటను జీవీఏ పూడ్చి వేయడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేక పోవడం, పాఠశాల ముందు సీసీ రోడ్డు 20 ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో అది పల్లంగా ఉండడం వల్ల వర్షపు నీరు, మురుగునీరు అంతా ఏక్కడ పాఠశాల ముందు నిల్వ చేరుతోంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పాఠశాల ప్రాంగణం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- బత్తినయ్యకోనకు వెళ్లి చిక్కుకుపోయిన భక్త బృందం
- స్థానికుల సాయంతో కాపాడిన రెవెన్యూ, పోలీసులు



వానలో.. అడవిలో 36h గంటలు

ఏర్పేడు మండలం బత్తినయ్యకోనకు వెళ్లి శ్రీకాళహస్తికి చెందిన 22 మంది భక్తులు 36 గంటలపాటు అడవిలో చిక్కుకుపోయిన సంఘటన ఆందోళనకు గురి చేసింది. ఆదివారం బయలుదేరిన వీరు మంగళవారం సాయంత్రం దాకా కూడా తిరిగి రాకపోవడంతో అందరూ ఆందోళన చెందారు. వానలకు ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వాగును దాటలేక, అడవిలో దారి తెలియక, సెల్‌ఫోన్లు పనిచేయక, తిండికూడా లేక పసిబిడ్డలు మొదలు ముసలివాళ్ల దాకా విలవిలలాడిపోయారు. ముసలిపేడు స్థానికుల ధైర్యసాహసాలు, రెవెన్యూ, పోలీసుల సహకారంతో వీరంతా మంగళవారం రాత్రికి సురక్షితంగా అడవి దాటి బయటకు వచ్చారు. ఈ సంఘటనలన్నీ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలా సాగాయి.

బత్తినయ్యకోన నుంచి టార్చిలైట్ సాయంతో అడవిలో వస్తున్న భక్తులు

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం బత్తినయ్య కోనలోని భక్తకంఠేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి నిద్ర చేస్తే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. శ్రీకాళహస్తికి చెందిన 45 మంది ఆదివారం ట్రాక్టర్‌లో ముసలిపేడుకు చేరుకున్నారు. ఆ రాత్రి అక్కడే పడుకుని, తెల్లవారుజామునే నడక మొదలు పెట్టారు. సోమవారం ఉదయం బత్తినయ్య కోనకు చేరుకున్నారు. పూజలు చేసుకుని 23మంది సోమవారం సాయంత్రానికి తిరిగి వచ్చేశారు. కార్తీక సోమవారం రాత్రి భక్తకంఠేశ్వరస్వామి సన్నిధిలో నిద్రిస్తే మంచిదని మిగిలిన 22మంది అక్కడే ఉండిపోయారు. మంగళవారం ఉదయం లేచి కొండ దిగడం మొదలు పెట్టారు. ఒకవైపు వాన.. మరోవైపు చలి.. దారిలో పంబ కాలువ ఉధ్రుతంగా ప్రవహిస్తుండటంతో దాట లేకపోయారు. ఫోన్లు పనిచేయకపోవడంతో ఇళ్లకు సమాచారమిచ్చే వీలు లేకపోయింది. సాయంత్రం అవుతున్నా వాగు ఉధ్రుతి తగ్గలేదు. ఆకలి.. భయం.. ఆందోళన పెరిగిపోయాయి. నిజానికి వాగు దాటకుండా అడవిలో నడిచి బత్తినయ్య గిరిజనకాలనీకి చేరుకునే వీలుంది. వీరికి ఆ అడవిమార్గం తెలియలేదు. వీరిలో జంగం దేవర కుమారుడి ఫోన్ ఒక తావులో పనిచేయడంతో ముసలిపేడుకి సమాచారం ఇచ్చాడు. ముసలిపేడు వాసులు ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ముసలిపేడు గ్రామానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. భక్తులు చిక్కుకుపోయిన వాగు వద్దకు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌సాయంతో అధికారులు కాలువను దాటడానికి ప్రయత్నించినా నీటి ఉధ్రుతి పెరుగుతూనే ఉండడంతో సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నలుగురు స్థానికులు సాహసించి తాడు సాయంతో కాలువ దాటి అవతలకు వెళ్లారు. అప్పటికే చిక్కుకుపోయిన వారు తిండిలేక నీరసించిపోయి ఉన్నారు. వారిని అడవిదారిలో బత్తినయ్య గిరిజనకాలనీకి తీసుకువచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని డోలిలో కిందకు మోసుకువచ్చారు. 22 మందికీ పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేశారు. కోన నుంచి ముసలిపేడుకు చేరుకున్న భక్తులకు టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, మనోహర్‌నాయుడు, అంకయ్య ఆధ్వర్యంలో భోజనం అందించారు. అక్కడ్నుంచి సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. తమను కాపాడిన అధికారులకు, ముసలిపేడు వాసులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తులను పలకరిస్తున్న అధికారులు



వృద్ధురాలిని జోలి కట్టి తీసుకొస్తున్న స్థానికులు



మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల్లో లీకేజీ

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల నుంచి మంగళవారం నీరు లీకేజీ అవుతోంది. డ్యాం డీఈ చంద్రమౌళిని వివరణ కోరగా.. అది సాధారణ లీకేజీ అని ఎటువంటి సమస్య లేదని చెప్పారు.

ఆలస్యంగా నడిచిన ఇండిగో విమానాలు

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షం నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి 10.35కు రేణిగుంటకు రావాల్సిన ఇండిగో విమానం మధ్యాహ్నం 1.20 గంటలకు వచ్చింది. 1.55 గంటలకు తిరిగి బయలుదేరింది. సాయంత్రం ముంబై నుంచి 5.20కి చేరుకోవాల్సిన విమానం 2 గంటలు ఆలస్యంగా వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు.

- అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు

5లోపు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 25 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం సూచించారు. మండలాల వారీగా ఖాళీలనుబట్టి ఎంఆర్సీలకు దరఖాస్తులు సమర్పించాలి. స్థానికులకు ప్రాధాన్యత ఉంటుంది. 75 శాతం అకడమిక్ మార్కులు, 25 శాతం ప్రొఫెషనల్ అర్హతా మార్కులు ఉండాలి. 7లోగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి, 8వ తేదీ నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు. ఈనెల 8 నుంచి వచ్చే ఏడాది మే 7వ తేది వరకు మాత్రమే ఈ నియామకం వర్తించనుంది.

కొనసాగుతున్న వాయుగుండం

- మరో 24 గంటలపాటు భారీ వర్షాలు
- తీరప్రాంతాల్లో జోరు వాన
- వాకాడులో అత్యధికంగా 92.8 మి.మీ



వడమాలపేట మండలం కల్లూరు వద్ద నక్కలవాగు ప్రవాహం



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది ప్రవాహం



కోట మండలం తిన్నెలపూడి వద్ద వరిపైరులో నీటి ప్రవాహం

సూళ్లూరుపేట/తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలహీనపడిన దిత్వా తుఫాను స్థిరంగా ఉంది. ఇది నైరుతి దిశగా పయనించి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తర తమిళనాడు తీరాన్ని ఆనుకొని ఉన్నట్లు తెలిపారు. దీని ప్రభావంతో మరో 24 గంటల పాటు జిల్లాలో భారీ వర్షాలు పడనున్నాయని చెప్పారు. ఇక, మంగళవారం తీరప్రాంతాల్లో భారీ వర్షం పడింది. తూర్పు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మొంథా తుఫానుతో చెరువులు నిండగా.. ఇకపై భారీ వర్షాలు కురిస్తే తెగిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాకాడులో 92.8.మి.మీ. చిట్టమూరు 87.2, తడ 80.8, దొరవారిసత్రం 64, కోట 58.2, సత్యవేడు 57, సూళ్ళూరుపేట 55, బీఎన్‌కండ్రిగ 50.6, వరదయ్యపాలెం 46.8, వడమాల పేట31.6,నాయుడుపేట 25.8, కేవీబీపురం 22.2మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 24.5మి.మీ.గా ఉంది. చిన్నగొట్టిగల్లు, బాలాయపల్లి, చంద్రగిరి, పాకాల, పిచ్చాటూరు, డక్కిలి, గూడూరులో వర్షపాతం నమోదు కాలేదు.

- వడమాలపేట మండలం కల్లూరు వద్ద నక్కల వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు ఆపేశారు.
- కేవీబీపురం మండలం తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువ ప్రవాహంతో పిచ్చాటూరు- శ్రీకాళహస్తి మధ్య రాకపోకలు ఆగాయి.
- ఏర్పేడు మండలం మోదుగులపాళెం-కొత్తవీరాపురం మధ్య స్వర్ణముఖినది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామీణులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.
- పలు ప్రాంతాల్లో నదీ ప్రవాహాలు, వంతెనల వద్ద పరిస్థితిని అధికారులు పరిశీలించారు. స్థానికులను అప్రమత్తం చేశారు.
- కాళంగి జలాశయం నీటిమట్టం 18.6 అడుగులకు చేరడంతో నాలుగు గేట్లు ఎత్తి నీటిని వదిలారు.
- వాకాడు వద్ద స్వర్ణముఖినది బ్యారేజీలోకి 7వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 8 గేట్లను ఎత్తారు.
- కోట మండలంలో దొరువుకట్ట, దైవాలదిబ్బవద్ద బలహీనంగా ఉన్న స్వర్ణముఖి నది కరకట్టలు ప్రమాదకరంగా మారాయి. శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం 30 మీటర్లు ముందుకొచ్చి కోతకు గురైనట్లు మత్స్యకారులు చెబుతున్నారు.







డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనరు మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు

'గ్రేటర్ తిరుపతి'కి సహకరించండి

డీఆర్సీ సమావేశంలో మంత్రి అనగాని పిలుపు

చంద్రగిరి గ్రామాల విలీనం వద్దన్న ఎమ్మెల్యే నాని

గ్రేటర్ ప్రతిపాదనపై తమను సంప్రదించలేదన్న ఎమ్మెల్యే సుధీర్

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్' ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. అందులో భాగంగానే గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన రూపుదిద్దుకుందన్నారు. ప్రస్తుతం 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న తిరుపతి కార్పొరేషన్‌ను.. మరింతగా అభివృద్ధి పరచడానికి అదనంగా 270 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించాల్సి ఉందన్నారు. శెట్టిపల్లె లబ్ధిదారులకు నిర్ణీత గడువులోగా పట్టాలు అందించాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయవద్దని ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రిని కోరారు. ఇక్కడున్న వారంతా రైతులు, పేదలేనన్నారు, విలీనం వల్ల ఇళ్లకు పన్నులు పెరగడం.. ఖాళీ స్థలాలకూ పన్నులు చెల్లించాల్సి రావడం భారమవుతుందన్నారు. ఈ అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రేటర్ తిరుపతిలో రేణిగుంట మండలం మొత్తాన్ని చేర్చాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు. గ్రేటర్‌కు తాము సంపూర్ణంగా సహకరిస్తామని, అయితే, ఈ ప్రతిపాదనపై తమను సంప్రదించలేదన్నారు. తమకు అవగాహన కల్పిస్తే పంచాయతీల్లో ప్రజలకు వివరించడానికి వీలవుతుందన్నారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్

పర్యావరణంపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచడంతో పాటు పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అనగాని అన్నారు. అందులో భాగంగా పులికాట్ కేంద్రంగా వచ్చే ఏడాది జనవరి 11, 12 లేదా 17, 18 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

గూడూరును నెల్లూరులో కలపండి

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంత్రిని కోరారు. అప్పుడే తమ నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలా అనుకూలంగానూ, సౌకర్యంగానూ ఉంటుందన్నారు. జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేశాకే ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేసిందని మంత్రి సమాధానమిచ్చారు. అభ్యంతరాలు తెలియజేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రధాన దృష్టి

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తిరుపతి నియోజకవర్గంలో 22ఏ నిషేధిత జాబితాలోని భూములు దేవదాయ శాఖ పరిధిలో లేకుంటే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల నిర్మాణాలకు.. పలు తహసిల్దారు కార్యాలయాల భవనాల మరమ్మతులకూ నిధులు కేటాయిస్తామన్నారు.

మొంథా.. ముంపు బాధితులకు సత్వర సాయం

మొంథా తుఫానులోను, కేవీబీపురం మండలం ఓలూరు రాయలచెరువు కట్ట తెగిన సమయంలోనూ బాధితులకు సత్వర సాయం అందించగలిగామని గణాంకాలు సహా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఈనెల 22లోగా శెట్టిపల్లె భూముల అభివృద్ధి పనులు పూర్తి చేసి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. గ్రేటర్ తిరుపతిలో 63 పంచాయతీలను విలీనం చేయాల్సి ఉండగా 13మాత్రమే ఆమోదం తెలిపాయన్నారు. హథీరాంజీ మఠం భవన పునరుద్ధరణ విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు.మూడు గంటలకుపైగా సాగిన సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, బల్లి కళ్యాణ చక్రవర్తి, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, రుద్రకోటి సదాశివం తదితరులతో పాటు కమిషనర్ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మా లక్ష్యం.. వైబ్రెంట్ తిరుపతి

'వైబ్రెంట్ తిరుపతి' లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణకు దిగుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు కేంద్రంగా మారనున్న తిరుపతి ప్రాంత అభివృద్ధికి గ్రేటర్ ప్రతిపాదన మంచి పరిణామమన్నారు. స్వర్ణముఖి బ్యూటిఫికేషన్ ద్వారా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పుట్టపర్తిలో చిత్రావతి నదికి చెక్‌డ్యామ్ కట్టిన తీరులో స్వర్ణముఖిపైనా చెక్‌డ్యామ్, లేజర్ షో వంటివి ఏర్పాటుచేసే ఆలోచన ఉందన్నారు. దేవదాయ శాఖ, మఠం భూములపై డీఆర్సీలో చర్చించామన్నారు. జిల్లాలో 36శాతం అటవీ భూములు ఉండటంతో సరిహద్దు భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

పోర్టు కోసమే గూడూరు కొనసాగింపు

'ప్రకాశం జిల్లాకు రామాయపట్నం, నెల్లూరు జిల్లాకు కృష్ణపట్నం పోర్టులున్నాయి. తిరుపతి జిల్లాకూ ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావన. అందుకే దుగరాజపట్నం పోర్టు ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోనే కొనసాగించాలని నిర్ణయించారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఎయిర్‌పోర్టు, నేషనల్ హైవేస్ కనెక్టివిటీ ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి కీలకమన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు, సంఘాలు తనను కోరారన్నారు. గూడూరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు సీఎం స్థాయిలో లోతైన సమీక్ష చేశారన్నారు. కొన్ని కారణాలతో తిరుపతిలోనే కొనసాగించాలని సీఎం భావిస్తున్నారన్నారు.

కులానికి, రాజకీయాలకు సంబంధం లేదు

'సత్యవేడు ఎమ్మెల్యేకి ఇవ్వాల్సిన గౌరవం, ప్రాధాన్యం ఇస్తున్నాం. డీఆర్సీ సమావేశంలోనూ ఎమ్మెల్యే ఆదిమూలం నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధికి సంబంధించి వినతి పత్రాలు అందజేశారు. కొన్ని తప్పిదాలమూలంగా కొందరు ప్రజలకు దూరమవుతారు. ప్రొటోకాల్‌పరంగా సమస్యలున్నాయని ఎమ్మెల్యే భావిస్తే శాసనసభలో ప్రివిలేజ్ కమిటీ వంటి వేదికలున్నాయి' అని మంత్రి సత్యప్రసాద్ చెప్పారు. కులానికి, రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టంచేశారు.



పొగమంచు వాలింది.. ఇలగొంతు వణికింది..

మన రాష్ట్రంలో అత్యంత చల్లని ప్రదేశంగా లంబసింగిని పేర్కొంటారు. సముద్రమట్టానికి 3,300 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రదేశం శీతాకాలంలో పొగమంచు కమ్మేసి ఉంటుంది. నేలకు వాలే మబ్బులు.. వణికించే చలి.. ఈ చల్లని అనుభూతి కోసం పర్యాటకులు పరుగులు తీస్తారు. సరిగ్గా ఇటువంటి వాతావరణమే తిరుమల కొండమీద గత మూడు రోజులుగా కనిపిస్తోంది. పగలు కూడా చీకటి కమ్ముకుంటోంది. లోయల్లోకి దిగిన మబ్బులతో కనుమరోడ్లు కొత్త అందాలను పంచుతున్నాయి. పొగమంచు మబ్బులు నేలకు వాలి ఆలయ పరిసరాలు మసక మసకగా మారిపోతున్నాయి. చలికి వణుకుతూనే ఈ దృశ్యాలు నేపథ్యంగా భక్తులు ఫోటోలు దిగుతున్నారు. పట్టపగలు కూడా హెడ్‌లైట్లు వేసుకునే వాహనాలు తిరుమలలో ప్రయాణించాల్సి వస్తోంది. మంచుమబ్బులతో కనువిందు చేస్తున్న శ్రీవారి పాదాలు, పాపనాశనం, పార్వేటి మండపం ప్రాంతాలను సందర్శించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి



సత్యవేడులో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైంది!

● ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైందని, దీనిపై సీఎం చంద్రబాబును కలసి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నియంతృత్వ ధోరణి వద్దనుకునే తాను గతంలో పెద్దిరెడ్డిని ఎదిరించి వైసీపీ నుంచీ బయటకు వచ్చానని, ఇపుడు ఇంకో రెడ్డిని తెచ్చి తన మీద పెడతారా అని ప్రశ్నించారు. ప్రొటోకాల్ విషయమై ఇప్పటికే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానన్నారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పెన్షన్లు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు తప్ప ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తాను ప్రజా దర్బార్ పెడుతుంటే, శంకర్‌రెడ్డి ఎలా పెడతారని ప్రశ్నించారు. సురుటిపల్లి ఆలయ ఛైర్మన్‌గా బియ్యం దొంగను నియమించారని దీనిపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానన్నారు. కేవీబీపురం మండలంలో చెరువు కట్ట తెగిన ప్రమాదంలో బాధితులకు ఆశించిన స్థాయిలో సాయం అందలేదని ఆరోపించారు. చాలా విషయాలు సీఎం చంద్రబాబుకు తెలియడం లేదని, తాను నేరుగా కలసి ఆయనకు ఫిర్యాదు చేస్తానన్నారు.

పళ్లికొండేశ్వర స్వామి భక్తుల కల సాకారం

● ఛైర్మన్ పద్మనాభరాజు ● ఆలయ ఈవోపై ఎమ్మెల్యే బెదిరింపులకు దిగడం తగదు

నాగలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామి భక్తుల పదేళ్ల సాకారమైందని ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు మంగళవారం చెప్పారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి అందించిన రూ.15 లక్షలు, పిచ్చాటూరు మిల్క్ డెయిరీ ఎండీ మునిశేఖర్ నాయుడు అందజేసిన రూ.10లక్షలతో రథోత్సవానికి అడ్డంకులు తొలగాయన్నారు. రథం వెళ్లే దారిలో ఉన్న ఇంటికి ఆ డబ్బు చెల్లించి తొలగిస్తున్నామని చెప్పారు. దాతలను సన్మానించడం తమ బాధ్యతని, దీన్ని వక్రీకరించడం తగదని ఎమ్మెల్యే ఆదిమూలానికి హితవు పలికారు. ఇలాంటి ఆరోపణలతో ఆలయ పవిత్రత దెబ్బతింటుందన్నారు. తనపై ఎలాంటి కేసులు లేవని, బ్రాందీషాపు లైసెన్స్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రొటోకాల్ విషయానికి వస్తే 15 రోజులకు ఒకసారి వచ్చే ప్రదోషాల ఆహ్వానంలో ఎమ్మెల్యే పేరు వేయాల్సిన అవసరం లేదన్నారు. శివరాత్రి ఉత్సవాలకు మాత్రమే ప్రొటోకాల్ వర్తిస్తుందన్నారు. దేవదాయ చట్టానికి లోబడి నడుచుకుంటున్న ఈవోపై బెదిరింపులకు దిగడం ఎమ్మెల్యేకు తగదన్నారు. పాలకమండలి సభ్యులు హంసరుద్రయ్య, కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులు నాయుడు, నాగభూషణమ్మ, నెల్సన్ మండేలా, జయంతి, దేవి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గూడూరు జేఏసీ నేతలు

● జేఏసీ నేతల డిమాండ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయండి. లేదంటే నెల్లూరు జిల్లాలో కలపండి అంటూ జేఏసీ కమిటీ సభ్యుడు దశరథరామిరెడ్డి డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం వీరు కాసేపు ధర్నా చేశారు. ఈ విషయంలో ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తమకు నెల్లూరు దగ్గరగా ఉంటుందని.. ఈ దిశగా సీఎం చంద్రబాబు గూడూరును ఆ జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగానిసత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రభాకర్, శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు. ● కాగా, తిరుపతి రూరల్ దామినేడు భూములను 22ఏ నుంచి తొలగించాలని పలువురు మంత్రికి వినతిపత్రం అందించారు. తమ భూముల్లో కోర్టు కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తమకు న్యాయంచేయాలంటూ మరికొందరు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు శ్రీవారిసేవకులు

● 'ట్రైయిన్ ద ట్రైనీస్' శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని సేవాసదన్-2లో మంగళవారం మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారిసేవను మరింత బలోపేతం చేయడం కోసం 'ట్రెయిన్ ద ట్రైనీస్' పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు ఈవో చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన గ్రూప్ సూపర్వైజర్లు (మాస్టర్ ట్రైనర్లు) పేర్లు నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే ఆయా ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే శిక్షణ అందించి వారిని భక్తులకు ఉన్నతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏపీ ప్రణాళికా విభాగం, ఐఐఎం-అహ్మదాబాద్ నిపుణులు శిక్షణ మాడ్యూల్‌ను రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పండితులు మేడసాని మోహన్, దామోదర్ నాయుడు, శ్రీనివాస్, చీఫ్ పీఆర్వో రవి, పీఆర్వో నీలిమ పాల్గొన్నారు.




కోట మండలం దైవాలదిబ్బ వద్ద తెగిపోయేందుకు సిద్ధంగా ఉన్న స్వర్ణముఖినది కరకట్ట

ప్రమాదకరంగా స్వర్ణముఖి కరకట్ట

కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి కోట మండలంలో పలు చెరువులు, స్వర్ణముఖి, చల్లకాలువ, మామిడికాలువలకు వరదనీరు పోటెత్తింది. స్వర్ణముఖినది ఉధ్రుత ప్రవాహానికి బలహీనంగా ఉన్న కరకట్టలు ప్రమాదకరంగా మారాయి. దొరువుకట్ట, దైవాలదిబ్బవద్ద కరకట్టల పరిస్థితి దారుణంగా ఉంది. సముద్రంలో ఎన్నడూలేని విధంగా అలలు ఎగిసిపడుతూ ముందుకు దూసుకొస్తున్నాయి. దీంతో మత్స్యకారులు తమ వలలు, పడవలను సురక్షిత ప్రదేశాలకు చేర్చుకున్నట్లు సమాచారం. మండలంలో 45 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. మొంథా తుఫాన్‌కు దాదాపుగా వర్షపునీటితో నిండి ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలకు కేశవరం, మద్దాలి, చిట్టేడుతోపాటు పెన్నక్కచెరువు. చంద్రశేఖరపురం కూడా గండిపడే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తడలో భారీ వర్షం

తడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తడలో మంగళవారం సాయంత్రం 4 నుంచి రెండు గంటలపాటు కుండపోతగా వర్షం పడింది. సుజాతనగర్ వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు భారీగా చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇక అయ్యప్పకాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చిచేరింది. దీంతో జనం కొంత ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకొని ఆ నీళ్లను బయటకుపంపేలా ఏర్పాట్లు చేశారు. మరో వైపు చెరువుల్లో జలకళ సంతరించుకుంది. వెండ్లూరుపాడు-మాంబట్టు రోడ్డు, వెండ్లూరుపాడు - కాదలూరు రోడ్లపై నీళ్లు పెద్ద ఎత్తున పారాయి. అలాగే అపాచీ పరిశ్రమ ఎదురుగా రోడ్డుపై నీళ్లు నిలిచిపోయాయి. ఇలా రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో అధికారులు ఆ రోడ్లపై రాకపోకలను నిలిపివేశారు. అయితే వర్షంతోపాటు చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో జనం ఇబ్బందులు పడ్డారు.


సుజాత నగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఇప్పటికే చెరువులన్నీ నిండుకుండలా జలకళతో సంతరించుకోవడంతో మరోసారి భారీ వర్షం కురిస్తే కొంత ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు.


ఇళ్లలోకి నీరు చేరడంతో మంచంపైనే కూర్చొని ఉన్న వృద్ధురాలు



బ్యారేజీ నుంచి దిగువకు

వరద ప్రవాహం

వాకాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది బ్యారేజీలోకి 7వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 8 గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఆయకట్టు చెరువులన్నీ పూర్తిగా నిండి ఉండటంతో వస్తున్న వరదను దిగువకు వదులుతున్నామని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

స్వర్ణముఖి బ్యారేజీ నుంచి దిగువకు 8 గేట్లు ఎత్తడంతో వరద ప్రవాహం

రేపటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువణ్ణామలైకి గురువారం నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సెంట్రల్ బస్సుస్టేషన్ ఏటీఎం ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పున్నమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం వేకువజామున 4 నుంచి శుక్రవారం ఉదయం 11గంటల వరకు ప్రతి అరగంటకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 99592 256784లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మాల్వాడిగుండంలో 'రీల్స్'

● ఒడిశా యువకులకు పోలీసుల కౌన్సెలింగ్


పోలీసు స్టేషన్‌లో యువకులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాల్వానిగుండం కాలువలో జలపాతం పరవళ్ళు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో కొందరు యువకులు మంగళవారం ప్రమాదకరమైన కొండపై నుంచి రీల్స్ చిత్రీకరించారు. ఎస్ఐ లోకేశ్‌బాబు తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన ముఖేష్, పీతల్, ములుషబకార్, బిశ్వంత్, ప్రసాద్‌నౌరి, లింగం ప్రదీప్ తిరుపతికి వలస వచ్చారు. ఇక్కడ కూలి పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. వీరు జీవకోన నుంచి అడ్డదారిలో శేషాచలం అడవుల్లోకి వెళ్లి.. మాల్వానిగుండం వద్దకెళ్లారు. ప్రమాదకరమైన కొండ పై నుంచి సరదాగా రీల్స్ చేస్తున్నారు. దీన్ని గమనించిన కొందరు స్థానికులు అలిపిరి ఏవీఎస్వో రమేష్‌కృష్ణకు సమాచారమిచ్చారు. ఆయన సిబ్బందితో కలసి వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అలిపిరి పోలీసులకు అప్పగించారు. ఇక్కడ ఎస్ఐ లోకేష్‌బాబు వారి వివరాలు తెలుసుకున్నారు. ఇలా కొండపై నిలబడి రీల్స్ చేస్తే జరిగే పరిణామాలు గురించి వారికి వివరించారు. భవిష్యత్తులో ఇలా చేస్తే కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించి వదిలిపెట్టారు.

బాలాజీ డివిజన్ ఏర్పాటుకు కృషి

● సాధన కమిటీకి టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ కృష్ణదేవరాయలు హామీ


ఢిల్లీలో ఎంపీ కృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే డివిజన్ సాధనసమితి నాయకులు

తిరుపతి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషిచేస్తానని టీడీపీ పార్లమెంటు ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు అన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటీ సభ్యులు మంగళవారం న్యూ ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంగా లావు కృష్ణ దేవ రాయలను కలిసి వినతిపత్రం అందజేశారు. బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానన్నారు. దీనిపై బుధవారం రైల్వే మంత్రితో అపాయింట్‌మెంట్ తీసి ఇస్తానని, కూటమినేతలతో సమావేశం ఏర్పాటుచేయిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎన్ఎఫ్ఐఆర్ రాఘవయ్యను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, డాక్టర్ వీసీ రాయలు, ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

నిండుతున్న రాయలచెరువు

రామచంద్రాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువుకు భారీగా నీరు చేరుతోంది. నీటిని కొలిచే ఏడవ మిద్దె పూర్తిగా మునిగిపోయింది. నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు అనుపల్లి, పిళ్లారికోనచెరువులు మరువ పారుతున్నాయి. అనుపల్లి నుంచి వచ్చే సుద్దేటివంక ఉధ్రుతంగా ప్రవహించి రాయలచెరువులో కలుస్తోంది. రాయలకాలంలో నీటిని కొలిచేందుకు ఏర్పాటుచేసిన ఏడుమిద్దెలలో ఐదు 50 ఏళ్ల కిందటే పూడికతో పూడుపోయాయి. ప్రస్తుతం ఉన్న రెండు మిద్దెలు నీటమునిగాయి. దీంతో చెరువు సగానికి పైగా నిండినట్లయింది. సుద్దేటి వంక రెండు నెలల పాటు ప్రవహించి రాయలచెరువుకుచేరుతోంది. చెరువులోనూ ఊటపుట్టి నీటి మట్టం పెరుగుతోంది. దీంతో రెండేళ్లకుపైగా సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు.



తిరుపతి కేంద్రంగా సీమ అభివృద్ధి

● రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో తిరుపతి కేంద్రంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుపతిని స్పిరిచ్యువల్ సెంటర్‌గా తీర్చిదిద్దడం సీఎం ఆకాంక్ష అన్నారు. అలాగే శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు స్వామి దర్శనంతో పాటు మరో రెండు మూడురోజుల సమయం కేటాయించేలా ఎకో టూరిజంను కూడా అభివృద్ధిపరచే ఆలోచనలో సీఎం ఉన్నారన్నారు. దీనిపై ఇప్పటికే తుడా ఛైర్మన్, అధికారులతో సమీక్షించామన్నారు. రానున్న వైకుంఠ ఏకాదశికి సంబంధించి ఇప్పటికే సీఎం సమీక్షించారని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. కాగా, ఇటీవల విశాఖలో జరిగిన సదస్సు ద్వారా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో దాదాపు 15 లక్షల మందికి ఉపాధి కలగబోతోందని మంత్రి చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



రాకేశ్ - స్నేహారెడ్డి

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నటుడు రాకేశ్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు.

తిరుమలలో ఘనంగా చక్రతీర్థ ముక్కోటి

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం చక్రతీర్థ ముక్కోటిని నిర్వహించారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో చక్రతీర్థ ముక్కోటిని నిర్వహించడం ఆనవాయితీ. అర్చకులు, పరిచారకులు, భక్తులు ఉదయం మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీ చక్రత్తాళ్వారుకు, నరసింహస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు.

తప్పు తమ్ముళ్లూ!

తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయ ముందు మధ్యాహ్నం 2 గంటల సమయంలో బడి వదిలేవేళ కనిపించిన దృశ్యం ఇది. తాగుతున్నది మామూలు సిగరెట్టో.. గంజాయి కూరిన సిగరెట్టో తెలీదు. బడి గేటు ముందే పొగరింగులు వదులుతూ, విద్యార్థులను రెచ్చగొడుతూ హీరోయిక్ పోజులు కొడుతున్న వీరిని చూసి పిల్లల కోసం వచ్చిన తల్లిదండ్రులు ఆందోళనతో, భయంతో ఇళ్లకు కదిలారు.

– తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద చేనేత కార్మిక సంఘం నాయకుల ధర్నా

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని చేనేత కార్మిసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఉన్న చేనేత కార్మికులు పనులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాల కారణంగా మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పట్టు, పడుగు, చరి తడిచిపోయి నష్టాలు చవిచూడాల్సివచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.25వేలు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ హామీని నెరవేర్చడంతో పాటు బియ్యం, నిత్యావసరాలు అందజేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటప్పయ్య, మురళి, బ్రహ్మయ్య, నారాయణ, గురుబాబు, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే జిల్లాల విభజన

వెంకటగిరి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే జిల్లాల విభజన జరిగిందని ఆ పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎన్‌జేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాల విభజన జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చామని అబద్ధపు మాటలు చెబుతోందన్నారు. వెంకటగిరిని డివిజన్ ఏర్పాటు అంశం గురించి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎక్కడా ప్రస్తావించినట్టు లేదని, కలువాయి, రాపూరు, సైదాపురం గూడూరు డివిజన్‌లో విలీనంపై మంత్రి ఆనం స్పందించాలన్నారు. గూడూరును నెల్లూరులో విలీనం చేసే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హామీలపై టీడీపీ నేతలే వివరణ ఇవ్వాలని రాంకుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలయ్య, కల్యాణి, లక్ష్మి, శంకరయ్య, వెంకటరత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం నేత పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా అవగాహన కల్పిస్తూ గంజాయి వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్న సీపీఎం నాయకుడు, ప్రజానాట్య మండలి నెల్లూరు కమిటీ కార్యదర్శి పెంచలయ్యను గంజాయి ముఠా కిరాతకంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. పెంచలయ్య కుటుంబానికి పరిహారం అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని, గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, చంద్రయ్య, ప్రసాద్, రవి, జిలానీ, మధు, వెంకట్రావు, ముత్యాలయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రాధికకు చెక్కు అందజేస్తున్న ఎంజీ బ్రదర్స్ ఆటో మొబైల్స్ ఎండీ గంగాధర్

పెళ్లకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి ఎంజీ బ్రదర్స్ ఆటో మొబైల్స్ ఎండీ మాచాని గంగాధర్ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. నాయుడుపేట లోతువానిగుంటకు చెందిన పేట లక్ష్మణ్(29) ఎంజీ బ్రదర్స్‌లో సర్వీస్ మెకానిక్‌గా పనిచేసేవాడు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా కోట సమీపంలోని పొలాల్లో నిలిచిపోయిన ట్రాక్టర్ రిపేరు చేసేందుకు వెళ్లాడు. అక్కడ నుంచి బైక్‌పై తిరిగి వస్తుండగా నాయుడుపేట సమీపంలో మూర్తిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో లక్ష్మణ్ మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఎంజీ బ్రదర్స్ ఆటో మొబైల్స్ అండగా నిలిచింది. అతనికి రావాల్సిన భీమా సొమ్ము రూ.5లక్షలు, ఎంజీ బ్రదర్ ఉద్యోగుల ఒక్కరోజు వేతనంతో పాటు యాజమాన్యం రూ.5 లక్షలతో కలిపి మొత్తం రూ.11 లక్షలను మృతుడి భార్య రాధికకు అందజేశారు. అలాగే లక్ష్మణ్ కుటుంబంలోని ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఎండీ గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వినుకొండ ధనుంజయ, కంపెనీ జీఎం వీరభద్రయ్య(భద్రి), ఏజీఎం మల్లిఖార్జునరావు, హెచ్‌ఆర్ మూర్తి, మురళి, బెల్లంకొండ కస్తూరయ్య పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్‌లను పరిష్కరించాలని సమ్మె చేయడం జరిగిందన్నారు. అప్పట్లో ప్రభుత్వం సమ్మెకాలపు జీతం చెల్లించేందుకు అంగీకరించిందని, అయితే ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శివకుమార్, బీవీరమణయ్య, మణి, ప్రసాద్, చంద్రయ్య, జిలానీ, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

వాకాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం ఆమె వాకాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రసాద్, ఎస్‌ఐ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీరు పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

వాకాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ మనపాళెం ప్రాథమిక పాఠశాలలో విద్యా వలంటీరు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో నసీం ఆలీ తెలిపారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

కారును ఢీకొన్న లారీ

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సర్కిల్ వద్ద మంగళవారం కారును లారీ ఢీకొంది. సూళ్లూరుపేట నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేసే సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది.

యువకుడి అదృశ్యం

బాలాయపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలిమిలి గ్రామానికి చెందిన పొట్టేళ్ల శీనయ్య కుమారుడు ప్రసన్న కుమార్(32) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని అతని తండ్రి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.




కోట మండలం ఊనుగుంటపాళెం సమీపంలో డంప్ చేసిన ఇసుక - ఇసుక అయిపోవడంతో ఖాళీగా ఉన్న విద్యానగర్‌లోని బిసిల్టింగ్ కేంద్రం

ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

స్వర్ణముఖి బఫర్ జోన్‌లో తవ్వకాలు ● చెన్నై, బెంగళూరుకు తరలించి విక్రయం

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్వర్ణముఖినది బఫర్ జోన్‌లో తవ్వి చెన్నై, బెంగళూరు నగరాలకు తరలించి విక్రయించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పింది. ఇందుకు అనుగుణంగా కోట మండలం గూడలి వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. స్వర్ణముఖినదిలో తవ్విన ఇసుకను విద్యానగర్‌లో బిసిల్టింగ్ కేంద్రంలో డంప్ చేసి, అవసరమైన వారికి సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం వర్షాల వల్ల స్వర్ణముఖిలోకి నీరు చేరడంతో రీచ్ యాజమాన్యం తవ్వకాలు నిలిపివేసింది. అలాగే డంప్ చేసిన ఇసుక అయిపోయింది. ఇదిలా ఉండగా స్వర్ణముఖి నదిలో ఇసుక అక్మమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కోట మండలంలోని రుద్రవరం, చిట్టమూరు మండలంలోని మెట్టు ప్రాంతంలో స్వర్ణముఖి బఫర్ జోన్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఊనుగుంటపాళెం సమీపంలో అటవీ ప్రాంతంలో డంప్ చేసి, ఇక్కడ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు తరలిస్తున్నారు. ఇసుక దొరక్క స్థానికులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు మాత్రం ఉచితం మాటున బయట ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల వద్ద రోడ్డుపై వర్షపునీరు - తడ: కాదలూరు - వెండ్లూరుపాడు రోడ్డుపై ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎడతెరపిలేని వర్షం

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి సూళ్లూరుపేటలో ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు, కాలువలతో పాటు కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. మంగళవారం ఉదయం నుంచి జోరువాన కురువడంతో సాయినగర్, ఆర్యభట్టనగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగి రోడ్ల మీదకు వర్షపునీరు చేరింది. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సాయినగర్ ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. షార్‌కు వెళ్లే రోడ్డులో డిగ్రీ కళాశాల వద్ద వర్షపునీరు రోడ్డు మీదకు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇలుపూరు - మంగళంపాడు మార్గాల మధ్యనున్న డొంక కాలువ వంతెనపై ఒక అడుగు మేరు నీరు చేరింది.

పరవళ్లు తొక్కుతున్న పులికాట్

దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కుస్తున్న వర్షాలతో పులికాట్‌కు భారీగా వరదనీరు చేరింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో పులికాట్ చల్లని గాలులల నడుమ సముద్రాన్ని తలపించేలా అలలు పరవళ్లు తొక్కుతోంది. సరస్సుకు భారీగా నీరు చేరడంతో శ్రీహరికోట రోడ్డుకు ఇరువైపులా జాలర్ల విసురు వలులు వేసి చేపల వేట సాగిస్తున్నారు.

కోటలో కుండపోత

కోట: మండలంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపిలేకుండా వర్షం పడడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, కాకితోపు, వెంకన్నపాళెం, రాజుపాళెం తదితర గ్రామాల్లోని వరి నారుమడులు, నాట్లు వేసిన పైర్లు నీట మునిగాయి. గూడలి పంచాయతీ పరిధిలోని దక్షిణ పొలంలో వారం రోజుల క్రితం నాటిన పుచ్చ పూర్తిగా దెబ్బతింది. అదే విధంగా కోట క్రాస్‌రోడ్డు వద్ద స్వర్ణముఖినది నుంచి చల్లకాలువలోకి వెళ్లే ప్రధాన కలుజు ఓవర్ ఫ్లో అయి పరవళ్లు తొక్కడంతో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఆర్ఐ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం లాక్‌లను బిగించారు.

బ్యారేజీ నుంచి దిగువకు వరద

వాకాడు: మండలంలోని స్వర్ణముఖినది బ్యారేజీలోకి 7 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని, ఎనిమిది గేట్‌లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చెరువులన్నీ పూర్తిగా నిండి పోయాయని, దీంతో వరద నీటిని దిగువకు వదులుతున్నామని ఆయన చెప్పారు.




నాయుడుపేట మండలం పుదూరులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు - పెళ్లకూరు మండలం జీలపాటూరులో నీట మునిగిన వరి

నీట మునిగిన పొలాలు

పెళ్లకూరు, డిశంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిల్లకూరు, జీలపాటూరు, పెళ్లకూరు, టెంకాయతోపు తదితర గ్రామాల్లో వరి పైరు నీటమునిగింది. మంగళవారం సాయత్రం కురిసిన భారీ వర్షానికి అన్ని చెరువులు నిండిపోయి ప్రమాదకర పరిస్థితికి చేరుకున్నాయి.

వాకాడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు జలమయం అయ్యాయి. తిరుమూరు, దుగరాజపట్నం, రావిగుంటపాళెం, వాకాడు, సిద్ధిగుంటపాళెం తదితర గ్రామాల్లో వరి పొలాలు నీటమునిగాయి.

నాయుడుపేట టౌన్: మండలంలో నాలుగు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖినదికి ఎగువ నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో నారుమడులు వేసేందుకు సిద్దంగా ఉన్న పొలాల్లో వర్షపునీరు ప్రవహిస్తోంది. వర్షాలు ఎక్కువైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత సెంటర్లకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అట్రాసిటీ కేసు నమోదు

డక్కిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు కథనం మేరకు.. మండలంలోని చెన్నసముద్రం గ్రామానికి చెందిన డక్కిలి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు మిట్టపాళెం గ్రామానికి చెందిన కేసనేని శేఖర్‌తో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. డక్కిలి వరలక్ష్మికి చెందిన భూమిని కేసనేని శేఖర్ గతంలో కొనుగోలు చేశాడు. తన భర్తను మోసం చేసి తమ పొలంను ఎలా రిజిస్టర్ చేయించుకున్నావని ప్రశ్నించినందుకు శేఖర్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులు కలిసి తనపై దాడి చేశారని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అట్రాసిటి కేసునమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చలిగాలులు తట్టుకోలేక వృద్ధుడి మృతి

డక్కిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో వీచిన చలిగాలులకు తట్టుకోలేక డక్కిలి మండలం డి.ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల రమణయ్య(86) మంగళవారం మృతి చెందాడు. నాలుగు రోజులుగా చలితో బాధపడుతున్న రమణయ్య పరిస్థితి మంగళవారం విషమించడంతో ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

తిప్పగుంటపాళెం చప్టాపై వరదనీరు

రాకపోకలు ఆపేసిన అధికారులు




తిప్పగుంటపాళెం చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

చిల్లకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న ఉప్పుటేరులోకి వరదనీరు చేరి చప్టాపై ప్రవహిస్తోంది. తహసీల్దారు శ్రీనివాసులు చప్టాపై వరద ప్రవాహాన్ని పరిశీలించి రాకపోకలు నిలిపివేశారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వీడని ముసురు

దొరవారిసత్రం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మోస్తరు వర్షంతో పాటు చలి గాలులు వీచాయి. కాళంగి నది నిండుగా ప్రవహిస్తుండడంతో తనియాలి వద్ద వంతెనపై వరద ప్రవాహం సాగుతోంది.

సముద్రంలో భీకర అలలు



కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సముద్రం అలజడులతో కల్లోల భరితంగా మారింది. యమదినెపాళెం, శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల వద్ద సముద్రం భీకర శబ్దాలతో అలలు ఎగిసిపడుతున్నాయి. అదే విధంగా శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం 30 మీటర్లు ముందుకొచ్చి కోతకు గురైనట్లు మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రం ఒడ్డున ఉన్న వలలు, పడవలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారు. ఎన్నడూలేని విధంగా సముద్రంలో అలలు ఎగిసిపడుతూ ముందుకు దూసుకొస్తుండటంతో తీరప్రాంత గ్రామాలు భయంగుప్పెట్లో ఉన్నాయి. గోవిందపల్లిపాళెం వద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ వరదనీటితో పరవళ్లు తొక్కుతుండటంతో చప్టాపై నీటి ప్రవాహం కారణంగా మత్స్యకార గ్రామానికి దారి సౌకర్యం లేకుండా పోయే ప్రమాదం ఉంది. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఎస్‌ఐ పవన్ మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్నారు.

చిట్టమూరులో భారీ వర్షం

చిట్టమూరు, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. వరి పంటలు నీట మునిగాయి. మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన గునపాడు స్వర్ణముఖి నది, ఎం.జంగాళపల్లి, చిట్టమూరు, మల్లాం రొయ్యల కాలువ వంతెనలను తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమా మహేశ్వరావు, ఎస్‌ఐ చిన్న బలరామయ్య పరిశీలించారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాకాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రతి ఒక్కరూఅప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ అన్నారు. మండలంలోని బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖినదిపై ఉన్న వంతెనను పరిశీలించి అక్కడ సిబ్బందిని నియమించారు. అనంతరం తూపిలిపాళెం సముద్రతీరంలో మత్స్యకారులకు తుఫాన్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ అఖిల్ తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో 12 మందిపై పీడీ యాక్ట్, ఎన్‌డీపీఎస్ నమోదు అరెస్టు చేయగా, అందులో తడకు చెందిన నల్లు మురళి, దారా ప్రసన్న ఉన్నారన్నారు. నల్లు మురళీపై ఇప్పటికి 7 గంజాయి కేసులు నమోదు కాగా, ఘర్షణలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించడంతో దారా ప్రసన్నపై 15కేసులు నమోదై ఉన్నాయన్నారు. వారిపై పీడీయాక్ట్ నమోదుచేసి జైలు శిక్ష పడేలా చేశామన్నారు. అలాగే మరి కొందరు రౌడీషీటర్లపై నిఘాపెట్టామని, భవిష్యత్తులో వారిలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకోని జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

సురక్షితంగా బయటపడ్డ విద్యార్థులు



పంట పొలాల్లో పడిపోయిన స్కూల్ బస్సు

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిధిలోని దావాదిగుంట వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 20 మంది విద్యార్థులు, నలుగురు టీచర్లు ఉన్నారు. ఎవరికీ ఏమీ కాలేదు. పోలీసుల కథనం మేరకు... గొల్లలములువు వద్దనున్న సీబీఎస్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు కారిజాత రోడ్డు మీదుగా షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలేనికి విద్యార్థులను తీసుకెళ్తుండగా దావాదిగుంట సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు దింపాడు. టైర్లు రోడ్డు మార్జిన్ మట్టిలో కుంగిపోయి పక్కనే ఉన్న సాగునీటి కాలువ గట్టు మీదకు బస్సు ఒరిగిపోయింది. వెంటనే సమీపంలో ఉన్న రైతులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని విద్యార్థులను, టీచర్లను బయటకు తీసి షార్ ఉద్యోగుల కాలనీలోని సతీష్ ధావన్ మెమోరియల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఎవరికీ ఏమీ కాలేదని చెప్పారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ బోల్తాపడిన బస్సును పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బస్సు పడిపోయిన విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమి కాలేదని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓబుల్‌రెడ్డి సేవలు మరువలేనివి



కార్మికుడికి బహుమతి అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధి ప్రసాద్

తడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తడలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి పునాది వేసిన నిప్పో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆ పరిశ్రమ చీఫ్ ఆపరేషన్, క్వాలిటీ ఆఫీసర్ పీఎల్ఎన్ ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి శతజయంతి, వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తడలో 1978లోనే పరిశ్రమలు ఏర్పాటు చేసిన ఓబుల్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఎన్నో ప్రజోపకార పనులను చేసి ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. పరిశ్రమలో 25, పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీల్లో విజేతలైన పరిశ్రమ ఉద్యోగుల కుటుంబసభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ రమేష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం



వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న ఆస్పత్రి ఉద్యోగులు

గూడూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఉత్తమ సేవలు అందించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న వైద్యుడు, సిబ్బందిని మంగళవారం ఏపీ జీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్) గూడూరు తాలుకా గౌరవాధ్యక్షుడు మస్తానయ్య, అధ్యక్షుడు శేఖర్‌రావు సన్మానించారు. ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ, టెక్నీషియన్ మౌలాలి, సిబ్బంది బాబురావు, ఆదిశేషయ్య, దిలీప్ సోమవారం తుమ్మపల్లి కళాక్షేత్రంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. బుధవారం ఆస్పత్రి వారిని సన్మానించారు.

మంత్రి అనగానిని కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి డీఆర్సీ సమావేశానికి విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే కలసి శాలువ కప్పి సత్కరించారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఎమ్మెల్యే కలసి నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని వివరించి బాగు చేయాలని కోరారు.